STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 115 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 07 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

మరో అవకాశం!



- ఓటు గల్లంతైన వారికి ఈసీ మరో చాన్స్!
- ముసాయిదా జాబితాలో పేరు లేకున్నా చేర్చుకునే అవకాశం

4

మార్కెట్‌లో లాభాల జాతర!

ఒక్కరోజే 1,718 పాయింట్లు దూసుకెళ్లిన సెన్సెక్స్



- మళ్లీ 25 వేల మార్కును అధిగమించిన నిఫ్టీ
- వరుసగా ఏడో రోజూ లాభాల్లో ముగిసిన దేశీయ సూచీలు

4


ప్రభుత్వ పథకాల లబ్ధికి ఓటర్ ఐడీ

- బీజేపీపై రాహుల్ గాంధీ ఆరోపణలు!
- జ్ఞానేశ్ కుమార్ పాత్రను ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత
- కేంద్ర మంత్రి లలన్ సింగ్ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

4







పాలం గట్లపై సీఎం!

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

- బురదలో అడుగులు..పంట బోదెల వద్దకు వెళ్లి రైతుల పరామర్శ
- ఆఖరి రైతు వరకూ ఆదుకుంటామని భరోసా.. నష్టాలపై నివేదికలు
- బాపట్ల, గుంటూరు జిల్లాల్లో చంద్రబాబు పర్యటన
- గత పాలకుల్లా రెడ్ కార్పెట్ వేయించుకోలేదని చురకలు

అర్నబ్, మురసు తుఫానులతో అతలాకుతలమైన రైతాంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొండంత అండగా నిలిచారు. వరద దెబ్బకు సర్వస్వం కోల్పోయిన వ్యవసాయ కూలీలు, రైతుల కష్టాలను కళ్లారా చూసేందుకు శుక్రవారం బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధికారుల సమీక్షలకే పరిమితం కాకుండా నేరుగా బురద పొలాల్లోకి దిగారు. కాలు జారే పంట బోదెలపై నడుచుకుంటూ వెళ్లి నేలకొరిగిన వరి పంటను పరిశీలించారు. తుఫాను హెచ్చరికల నేపథ్యలో రాష్ట్ర యంత్రాంగాన్ని ముందుగానే అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని భారీగా తగ్గించిన ప్రభుత్వం.. ఇప్పుడు నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటుందని సీఎం హామీ ఇచ్చారు. -సమయం న్యూస్, అమరావతి

2



తమిళ జాలర్ల మృతి పట్ల పవన్ దిగ్భ్రాంతి!

- సముద్రంలో బోటు మునిగిన ఘటనపై విచారం
- గల్లంతైన వారికోసం గాలింపు ముమ్మరం చేయాలి
- మృతదేహాలను స్వస్థలాలకు తరలించేలా ఏర్పాట్లు
- ప్రకాశం జిల్లా కలెక్టర్‌కు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు

2

ఏపీకి 1,919 కోట్ల నష్టం!

తక్షణమే ఆదుకోండి.. అమిత్ షాకు సీఎం లేఖ

వ్యవసాయానికే తీవ్ర నష్టం.. 15 రోజుల్లో పూర్తి నివేదిక

2

ఏపీలో పల్లె పోరు!

గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

మూడు విడతల్లో పోలింగ్ నిర్వహణ



నవంబర్ 13, 18, 19 తేదీల్లో నోటిఫికేషన్లు

ఉదయం ఓటింగ్.. మధ్యాహ్నం కౌంటింగ్

వివరాలు 3లో..

వారంలోగా నోటిఫికేషన్

- పెండింగ్ 23 మున్సిపాలిటీలకు ఎన్నికలు
- ఇప్పటికే పూర్తయిన రిజర్వేషన్లు
- 25లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి!

3



నేడే 'పరిషత్' తీర్పు!

3



ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

- తుపానులతో విద్యుత్ శాఖకు రూ. 500 కోట్ల నష్టం
- నేలకూలిన 7,500 స్తంభాలు..
- మంత్రి గొట్టిపాటి

2

అర్నబ్, మురసు తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో ప్రతి రైతును, ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నేటి (శనివారం) సాయంత్రానికి 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడమే లక్ష్యంగా పనులు చేపట్టినట్లు తెలిపారు.

టీటీడీ చైర్మన్‌గా రవిచంద్ర!

- బంగారు వాకిలి వద్ద లాంఛనంగా ప్రమాణ స్వీకారం
- భక్తులకు మరింత మెరుగైన సేవలు అందిస్తాం
- విద్య, వైద్య రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం
- ఆలయంలో ప్రమాణం చేయించిన అదనపు ఈవో

2వ పేజీలో..



ఏపీలో మరో డీఎస్సీ!

నిరుద్యోగులకు సర్కార్ దీపావళి కానుక

- 2,721 పోస్టులతో 2026 నోటిఫికేషన్ విడుదల
- నవంబర్ 11 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు
- ఏటా డీఎస్సీ హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం దీపావళి కానుక అందించింది. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ఇచ్చిన హామీ మేరకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.



3

సర్కారు కాలేజీల్లో 161 కొత్త పీజీ సీట్లు!

- 11 వైద్య కళాశాలల్లో 15 విభాగాలకు ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్
- 163 స్థానాలకు ప్రతిపాదిస్తే 161 సీట్లకు ఆమోదం
- ఆర్థోపెడిక్స్‌లో అత్యధికంగా 27 సీట్ల మంజూరు


3

చీరాల ఫలితాలతో కాంగ్రెస్‌లో చిగురించిన ఆశలు



- మున్సిపల్ ఎన్నికల్లో 10 వార్డులు కైవసం
- పలుచోట్ల రెండో స్థానంతో సత్తాచాటిన హస్తం
- మూడో స్థానానికి పడిపోయిన వైఎస్సార్ కాంగ్రెస్
- ఆమంచి కృష్ణమోహన్ చొరవతో మళ్లీ చిగురించిన ఆశలు
- మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకున్న తెలుగుదేశం

వివరాలు 3లో..



ఏపీకి 1,919 కోట్ల నష్టం!

తక్షణమే ఆదుకోండి.. అమిత్ షాకు సీఎం లేఖ

వ్యవసాయానికే తీవ్ర నష్టం..15 రోజుల్లో పూర్తి నివేదిక

అమరావతి, నవంబర్ 6 (సమయం న్యూస్) : వరుస తుఫాన్లతో ఆంధ్రప్రదేశ్‌కు భారీ నష్టం వాటిల్లింది. మురసు తుఫాన్ కారణంగా రాష్ట్రంలో ప్రాథమికంగా రూ. 1,919.59 కోట్ల మేర నష్టం సంభవించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి వివరించారు. బాధితులను ఆదుకోవడంతో పాటు మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు తక్షణమే మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. వారం రోజుల వ్యవధిలోనే అర్నబ్, మురసు తుఫాన్లు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయని సీఎం తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే సీజన్‌లో రైతులు, మత్స్యకారులు రెండుసార్లు దెబ్బతిన్నారని తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం.. మురసు తుఫాన్ ప్రభావంతో వ్యవసాయ రంగానికి అత్యధికంగా రూ. 874.96 కోట్ల నష్టం వాటిల్లింది. 1,43,122 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులు నష్టపోయారు. మరోవైపు ఉద్యాన రంగానికి రూ. 337.10 కోట్ల నష్టం సంభవించింది. పశుసంవర్ధక, ఆక్వా, సాగునీరు, గృహ నిర్మాణ, విద్యుత్, పంచాయతీరాజ్, విద్యా, వైద్య శాఖలకూ తీవ్ర నష్టం వాటిల్లిందని లేఖలో వివరించారు. ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని కొంతమేర తగ్గించగలిగామని స్పష్టం చేశారు. వరద నీరు పూర్తిగా తగ్గిన తర్వాత నష్టాలపై క్షేత్రస్థాయిలో అంచనా వేసి మరో 15 రోజుల్లో పూర్తి నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అప్పటివరకు వేచి చూడకుండా, నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు వెంటనే మధ్యంతర ఆర్థిక సాయం మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. కేంద్రం సత్వరమే ఆదుకుంటేనే రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు త్వరగా నెలకొంటాయని చంద్రబాబు తన లేఖలో స్పష్టం చేశారు.

తమిళ జాలర్ల మృతి పట్ల పవన్ దిగ్భ్రాంతి!

సముద్రంలో బోటు మునిగిన ఘటనపై విచారం

గల్లంతైన వారికోసం గాలింపు ముమ్మరం చేయాలి

మృతదేహాలను స్వస్థలాలకు తరలించేలా ఏర్పాట్లు

ప్రకాశం జిల్లా కలెక్టర్‌కు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు



అమరావతి, నవంబర్ 6 (సమయం న్యూస్) : మురసు తుఫాను అలజడి కారణంగా సముద్రంలో బోటు మునిగిపోయి, తమిళనాడుకు చెందిన ఏడుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను ఎంతో కలచివేసిందని పేర్కొంటూ.. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రకాశం జిల్లా కలెక్టర్ ద్వారా పవన్ కళ్యాణ్ అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదానికి గురైన సమయంలో ఆ బోటులో మొత్తం తొమ్మిది మంది మత్స్యకారులు ఉన్నారని కలెక్టర్ ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారిలో ఇప్పటివరకు ఏడుగురి మృతదేహాలు లభ్యమయ్యాయని, మిగిలిన ఇద్దరి ఆచూకీ ఇంకా లభించలేదని వివరించారు. దీనిపై స్పందించిన పవన్ కళ్యాణ్.. గల్లంతైన ఆ ఇద్దరి జాలర్ల కోసం కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకార బృందాల సమన్వయంతో గాలింపు చర్యలను తక్షణమే ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు.

లభ్యమైన మృతదేహాల గుర్తింపు, పోస్టుమార్టం ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయా మృతదేహాలను సగౌరవంగా వారి స్వస్థలాలకు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌కు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. విపత్తులు, తుఫాను హెచ్చరికల సమయంలో మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలోకి వేటకు వెళ్లకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సముద్రంలో వాతావరణ అలజడులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు జాలర్లకు తెలియబరుస్తూ, ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

పొలం గట్లపై సీఎం!

- **బురదలో సాగిన ముఖ్యమంత్రి అడుగులు**
- **పంట బోదెల వద్దకు వెళ్లి రైతుల పరామర్శ**
- **ఆఖరి రైతు వరకూ ఆదుకుంటామని భరోసా**
- **బాపట్ల, గుంటూరు జిల్లాల్లో చంద్రబాబు పర్యటన**
- **అర్నబ్, మురసు నష్టాలపై నివేదికలు**
- **గత పాలకుల్లా రెడ్ కార్పెట్ వేయించుకోలేదని చురకలు**

అమరావతి, నవంబర్ 6 (సమయం న్యూస్): సచివాలయంలో ఏసీ గదుల్లో సమీక్షలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను స్వయంగా చూసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొలం గట్లపైకి నడిచారు. తుఫాను దెబ్బకు నీటమునిగిన పంటలను, రైతుల ఆవేదనను కళ్లారా చూశారు. అర్నబ్, మురసు తుఫాన్లు రాష్ట్ర రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీయడంతో.. కష్టకాలంలో వారికి అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి నేరుగా రంగంలోకి దిగారు. శుక్రవారం ఆయన బాపట్ల, గుంటూరు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. బాపట్ల మండలంలోని జిల్లెళ్లమూడి వంతెన వద్ద వరద ఉద్ధృతిని పరిశీలించిన సీఎం.. అక్కడి నుంచి ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రేటూరు గ్రామంలో దెబ్బతిన్న వరి పొలాల వద్దకు కాలినడకన వెళ్లారు. పంట బోదెలపై నడుస్తూ, నేరుగా పొలాల్లోకి దిగి నష్టాన్ని అంచనా వేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి తుఫాను పాలవడంతో కన్నీరు పెట్టుకుంటున్న అన్నదాతలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

అప్రమత్తతతో తగ్గిన నష్టం..

తుఫాను ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికలతో అక్టోబర్ 27 నుంచే రాష్ట్ర యంత్రాంగాన్ని సీఎం అప్రమత్తం చేశారు. రాత్రిళ్లు సైతం టెలి కాన్ఫరెన్సులు నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రేటూరు వద్ద రైతులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ.. ముందస్తు చర్యలతోనే చాలా వరకు ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగామన్నారు. అర్నబ్ తుఫాను వల్ల కోనసీమలోని కాట్రేనికోన నుంచి పశ్చిమగోదావరిలోని మొగల్తూరు, నరసాపురం వరకు నష్టం వాటిల్లిందని, ఇప్పుడు మురసు తుఫానుతో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావంతో కరువు ఛాయలు అలుముకుంటే.. పట్టిసీమ ద్వారా నీళ్లందించి రైతులు పంటలు వేసుకునేలా చేశామన్నారు. తీర ప్రాంతంలో ఇప్పుడు కురిసిన వర్షాలకు ఆ పంటలు దెబ్బతినడం దురదృష్టకరమని చెప్పారు.

ఆఖరి రైతు వరకూ ఆదుకుంటాం..

పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. నష్టపోయిన పెట్టుబడిని రైతులు తిరిగి పొందేలా ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్నారు. తుఫాను సహాయ చర్యల కోసం పొరుగున ఉన్న తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సాంకేతిక సిబ్బంది సాయం తీసుకున్నట్లు వెల్లడించారు. అర్నబ్ ప్రభావంతో నేలకొరిగిన 30 వేల విద్యుత్ స్తంభాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించామని, మురసు కారణంగా దెబ్బతిన్న మరో 10 వేల స్తంభాలను సైతం బాగుచేసి ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు వివరించారు. ఈ రెండు తుఫాన్ల వల్ల సంభవించిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, ప్రధాని మోదీ సైతం ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. నల్లమడ డ్రైన్‌కు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.



రెడ్ కార్పెట్ పరామర్శలు కావివి..

విపత్తుల సమయంలో గత పాలకులు రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలు చేశారని చంద్రబాబు విమర్శించారు. కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకున్నారని, తమకు ఎన్నికల కంటే ప్రజా సమస్యలే ముఖ్యమని స్పష్టం చేశారు. పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చాక రాజకీయాలపై మాట్లాడతానని తేల్చిచెప్పారు. తీర ప్రాంతాలను తుఫాన్లు దెబ్బతీస్తే.. రాయలసీమ ప్రాంతాన్ని ఎల్ నినో కరువు ఇబ్బంది పెడుతోందన్నారు. రాయలసీమలో కరువు పరిస్థితులపై ఇప్పటికే కేంద్ర బృందాలు అధ్యయనం చేశాయని వివరించారు. తీరాన వర్షపు నీరు వృథాగా సముద్రంలోకి పోతుంటే.. సీమలో నీటి కరువు ఉందన్నారు. అందుకే జల భద్రత, సమర్థవంతమైన నీటి నిర్వహణకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

టీటీడీ బోర్డు చైర్మన్‌గా రవిచంద్ర!

- **బంగారు వాకిలి వద్ద లాంఛనంగా ప్రమాణ స్వీకారం**
- **భక్తులకు మరింత మెరుగైన సేవలు అందిస్తాం**
- **విద్య, వైద్య రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం**
- **ఆలయంలో ప్రమాణం చేయించిన అదనపు ఈవో**

తిరుమల, నవంబర్ 6 (సమయం న్యూస్): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సాధికారిక మండలి చైర్మన్‌గా ఈవో ముద్దాడ రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద జరిగిన కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి ఆయనతో లాంఛనంగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు నూతన చైర్మన్‌కు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాణ స్వీకారం అనంతరం ముద్దాడ రవిచంద్ర ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. దేవుని సేవ చేసేందుకు ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం టీటీడీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత మెరుగైన రీతిలో కొనసాగించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. దర్శనానికి వచ్చే భక్తులు తమ మనసును పూర్తిగా



స్వామివారిపైనే లగ్నం చేసేలా అన్ని ఏర్పాట్లు కల్పిస్తామన్నారు.

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు టీటీడీ నిర్వహిస్తున్న ఇతర 64 ఆలయాల్లోనూ భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చైర్మన్ తెలిపారు. టీటీడీ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే టీటీడీ ఆధ్వర్యంలోని ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఆధునిక సౌకర్యాలతో మెరుగైన వైద్య సేవలు అందిస్తామని రవిచంద్ర వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేఈవో ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

- **ఈ సాయంత్రానికే 100 శాతం కరెంట్!**
- **తుపానులతో విద్యుత్ శాఖకు రూ. 500 కోట్ల నష్టం**
- **నేలకూలిన 7,500 స్తంభాలు.. యుద్ధప్రాతిపదికన పనులు**
- **అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో పర్యటన**
- **పొలాల్లోకి వెళ్లి నష్టాన్ని పరిశీలించిన గొట్టిపాటి రవికుమార్**

అద్దంకి, నవంబర్ 6 (సమయం న్యూస్): అర్నబ్, మురసు తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో ప్రతి రైతును, ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నేటి (శనివారం) సాయంత్రానికి 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడమే లక్ష్యంగా పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ రెండు తుపాన్ల కారణంగా విద్యుత్ శాఖకు ఏకంగా రూ. 500 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని వెల్లడించారు.

మంత్రి శుక్రవారం అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి తుపాను నష్టాన్ని పరిశీలించారు. జె.పంగులూరు మండలంలోని ముప్పవరం, కొండమంజులూరు, కోటపాడు, జనకవరం, తూర్పు తక్కెళ్లపాడు, అలవలపాడు గ్రామాలతో పాటు కొరిశపాడు మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. నాగులుప్పలపాడు మండలంలోనూ పర్యటించారు. కోటపాడులో కూలిన ఇళ్లు, పశువుల కొట్టాలు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను.. తూర్పు తక్కెళ్లపాడులో పొలాల్లో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను చూశారు. తుపాను నష్టంపై బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్



ఆయన వెంట ఉన్నారు.

నష్టం అంచనాల్లో పారదర్శకత ఉండాలి..

తుపాను ప్రభావంతో మొక్కజొన్న, అరటి, బొప్పాయి, ఉసిరి, మామిడి తోటలు దెబ్బతిన్నాయని మంత్రి తెలిపారు. సంతనూతలపాడు, అద్దంకి, ఒంగోలు పరిసర ప్రాంతాల్లో పొగాకు పంటకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ప్రకాశం జిల్లాలో పొగాకు బ్యార్నీలు కూడా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి పంట నష్టం అంచనాలను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఏసీ గదులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ నష్టాన్ని నమోదు చేయాలన్నారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా పారదర్శకంగా అంచనాలు రూపొందించాలని స్పష్టం చేశారు.

7,500కు పైగా నేలకూలిన స్తంభాలు..

అర్నబ్ తుపాను సమయంలో గంటకు 160 కిలోమీటర్ల వేగంతో, మురసు తుపాను సమయంలో 120 కిలోమీటర్లకుపైగా వేగంతో గాలులు వీచాయని మంత్రి వివరించారు. దీంతో విద్యుత్ లైన్లు, కండక్టర్లు తెగిపోవడంతో పాటు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయని తెలిపారు. కేవలం మురసు తుపాను కారణంగానే 7,500కుపైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయన్నారు. వర్షాలు తగ్గినప్పటి నుంచి విద్యుత్ సిబ్బంది నిరంతరాయంగా పనిచేస్తున్నారని, ఇప్పటికే 70 శాతం మేర కరెంట్ పునరుద్ధరించినట్లు వివరించారు. ఒంగోలు, చిలకలూరిపేట, నరసరావుపేట, అద్దంకి పట్టణాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పూర్తయిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో 24 గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో.. ముందుగా గృహ వినియోగదారులకు కరెంట్ ఇచ్చి, ఆ తర్వాత వ్యవసాయ, ఆక్వా రంగాలకు పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. శనివారం సాయంత్రానికి తుపాను ప్రభావిత ప్రాంతాలన్నింటికీ కరెంట్ సరఫరా అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు.

ఏపీలో పల్లె పోరు!



- గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- మూడు విడతల్లో పోలింగ్ నిర్వహణ
- నవంబర్ 13, 18, 19 తేదీల్లో నోటిఫికేషన్లు
- ఉదయం ఓటింగ్.. మధ్యాహ్నం కౌంటింగ్

అమరావతి, నవంబర్ 6 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సమరానికి నగారా మోగింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం మూడు విడతల్లో ఈ ప్రతిష్టాత్మక ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఈ షెడ్యూల్ ప్రకటనతో గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కసారిగా రాజకీయ సందడి మొదలైంది. గ్రామ స్థాయిలో తమ సత్తా చాటుకునేందుకు ఆశావహులు, స్థానిక నాయకులు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించడంతో పల్లెల్లో ఎన్నికల కోలాహలం నెలకొంది.

విడతల వారీగా నోటిఫికేషన్లు..

తాజా షెడ్యూల్ ప్రకారం.. మొదటి విడత పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 13వ తేదీన విడుదల కానుంది. ఆ తర్వాత రెండో విడత నోటిఫికేషన్ 18న, మూడో విడత నోటిఫికేషన్ 19న వెలువడనుంది. నోటిఫికేషన్లు వెలువడిన వెంటనే నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ఘట్టాలు వరుసగా జరగనున్నాయి. ఎన్నికల రోజున ఉదయం 6:30 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 1:00 గంట వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. ఉదయాన్నే పోలింగ్ ప్రారంభించడం ద్వారా ఎక్కువ శాతం ఓటింగ్ నమోదు చేయాలన్నది అధికారుల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

అదే రోజు ఫలితాలు.. కోడ్ అమలు..

సాధారణ ఎన్నికలకు భిన్నంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు. మధ్యాహ్నం 1:00 గంటకు పోలింగ్ పూర్తి కాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా కౌంటింగ్ మొదలవుతుంది. సాయంత్రానికే సర్పంచ్, వార్డు సభ్యుల గెలుపోటములపై పూర్తి స్పష్టత రానుంది. ఏ రోజుకారోజు ఫలితాలు తేలిపోనుండటంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో ఈ పోరు నిర్వహణకు అధికార యంత్రాంగం ఇప్పటికే కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. షెడ్యూల్ విడుదల కావడంతో పల్లెల్లో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేలా పోలీసు శాఖ కూడా భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించింది.

నేడే 'పరిషత్' తీర్పు!



- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- ఉదయం 8 గంటలకే ప్రారంభం కానున్న కౌంటింగ్
- రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో మూడంచెల భద్రత
- పెరిగిన పోలింగ్‌తో అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ
- ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్‌కు ఈసీ ఏర్పాట్లు

విజయవాడ, నవంబర్ 6 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాలకు కౌంట్‌డౌన్ మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎవరి సత్తా ఏంటో తేల్చే ఈ పరిషత్ పోరు ఓట్ల లెక్కింపు నేడు (శనివారం) ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 365 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 9,062 బల్లలపై ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏకకాలంలో కొనసాగనుంది. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఈ భారీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు 11,002 మంది కౌంటింగ్ పర్యవేక్షకులను, వారికి తోడుగా 28,692 మంది సహాయకులను అధికార యంత్రాంగం నియమించింది.

పెరిగిన పోలింగ్.. పెరిగిన టెన్షన్..

రాష్ట్రంలో మొత్తం 577 జెడ్పీటీసీ, 7,707 ఎంపీటీసీ స్థానాలకు నవంబర్ 5న పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో ఓటర్లు భారీగా తరలిరావడంతో ఏకంగా 70.72 శాతం పోలింగ్ నమోదైంది. గత 2021 ఎన్నికలతో పోలిస్తే ఈసారి 9.81 శాతం పోలింగ్ పెరగడం విశేషం. పోలింగ్ శాతం అమాంతం పెరగడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల్లో గెలుపోటములపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఎన్నికలకు ముందే 77 జెడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. బుధవారం ఏడు సమస్యాత్మక కేంద్రాల్లో రీపోలింగ్ కూడా ప్రశాంతంగా ముగిసింది. బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ పెట్టెల ధ్వంసం లాంటి అవాంఛనీయ ఘటనలు జరిగిన ఈ ఏడు కేంద్రాల్లో అధికారులు భారీ భద్రత నడుమ పోలింగ్ నిర్వహించారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్లు..

కౌంటింగ్ కేంద్రాల్లో నిబంధనల ప్రకారం.. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించనున్నారు. ఆ తర్వాత ఎబ్యాలెట్ పత్రాల లెక్కింపు చేపడతారు. కౌంటింగ్ ప్రక్రియ వేగంగా సాగేందుకు ప్రతి బల్లకు ఒక్కో రౌండ్‌లో 1,000 బ్యాలెట్ పత్రాలను అందించనున్నారు. ఎంపీటీసీ ఫలితాలు మధ్యాహ్నానికే వెలువడే అవకాశం ఉండగా, జెడ్పీటీసీ ఫలితాలకు మాత్రం సాయంత్రం వరకు వేచిచూడాల్సిందే.

నిఘా నీడలో కౌంటింగ్ కేంద్రాలు..

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాష్ట్రవ్యాప్తంగా 365 కౌంటింగ్ కేంద్రాల వద్ద 19,885 మంది పోలీసులతో కట్టుదిట్టమైన మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఇందులో 135 మంది డీఎస్పీలు, అదనపు ఎస్పీ స్థాయి అధికారులు, 572 మంది ఇన్‌స్పెక్టర్లు, 1,412 మంది ఎస్ఐలు, 14,877 మంది ఇతర పోలీసు సిబ్బంది, 2,889 మంది హోంగార్డులు అణువణువూ పహారా కాయనున్నారు. సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, బాడీ వోర్న్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టుపక్కల సెక్షన్ 144 అమలులో ఉంటుందని, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు.

ఏపీలో మరో డీఎస్సీ!

నిరుద్యోగులకు సర్కార్ దీపావళి కానుక
2,721 పోస్టులతో 2026 నోటిఫికేషన్ విడుదల
నవంబర్ 11 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు
ఏటా డీఎస్సీ హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం



అమరావతి, నవంబర్ 6 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం దీపావళి కానుక అందించింది. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ2026 సమగ్ర నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మొత్తం 2,721 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2025 మెగా డీఎస్సీ ద్వారా ఇప్పటికే 15,941 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం.. తాజాగా మరోసారి నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి.

పోస్టుల వివరాలివే..

తాజా నోటిఫికేషన్‌లో మొత్తం 2,721 పోస్టులను భర్తీ చేయనున్నారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి..

రెగ్యులర్ స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులు : 2,111
ప్రత్యేక విద్యా ఉపాధ్యాయ పోస్టులు : 350
వివిధ సొసైటీల పరిధిలోని పోస్టులు : 260

నవంబర్ 11 నుంచి అప్లికేషన్లు..

డీఎస్సీ2026 నియామక ప్రక్రియకు సంబంధించి నవంబర్ 11వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. అభ్యర్థులకు కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల షెడ్యూల్, అర్హతలు, దరఖాస్తు విధానం, ఇతర పూర్తి వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

సర్కారు కాలేజీల్లో 161 కొత్త పీజీ సీట్లు!

- 11 వైద్య కళాశాలల్లో 15 విభాగాలకు ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్
- 163 స్థానాలకు ప్రతిపాదిస్తే 161 సీట్లకు ఆమోదం
- ఆర్థోపెడిక్స్‌లో అత్యధికంగా 27 సీట్ల మంజూరు
- మెరిట్ విద్యార్థులకు మరింత చేరువగా వైద్య విద్య



గుంటూరు, నవంబర్ 6 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ వైద్య విద్యను మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2026ఉ 27 విద్యా సంవత్సరానికి గాను 161 కొత్త పీజీ వైద్య సీట్లను జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) మంజూరు చేసింది. మొత్తం 15 వైద్య విభాగాల్లో ఈ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. 163 సీట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా, ఏకంగా 161 సీట్లకు అనుమతులు లభించాయి. దీంతో 98.77 శాతం లక్ష్యాన్ని సాధించినట్లయింది. ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బోధనా సిబ్బంది నియామకాలు, పడకల పెంపు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టడంతో ఈ అదనపు సీట్లు మంజూరయ్యాయి. ఈ నిర్ణయంతో మెరిట్ విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లో పీజీ వైద్య విద్యను అభ్యసించే అవకాశాలు భారీగా పెరగనున్నాయి. విభాగాల వారీగా పరిశీలిస్తే.. ఆర్థోపెడిక్స్‌లో అత్యధికంగా 27 సీట్లు మంజూరయ్యాయి. డీవీఎల్, ఈఎన్‌టీ, పాథాలజీ విభాగాల్లో 16 చొప్పున, రేడియో డయాగ్నోసిస్‌లో 14, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీలో 12 చొప్పున సీట్లు దక్కాయి. జనరల్ మెడిసిన్, అనస్థీషియాలజీ, ఆప్తాల్మాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్ విభాగాల్లో 8 చొప్పున.. ఎమర్జెన్సీ మెడిసిన్, ప్రసూతి-గైనకాలజీ, సైకియాట్రీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల్లో 4 చొప్పున సీట్లు లభించాయి. ముఖ్యంగా ఎమర్జెన్సీ మెడిసిన్, శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఆరోగ్యం, క్యాన్సర్ చికిత్స లాంటి కీలక రంగాల్లో వైద్య నిపుణుల సంఖ్య పెరిగేందుకు ఈ సీట్లు ఎంతో దోహదపడనున్నాయి.

కౌన్సెలింగ్ ద్వారా భర్తీ : డీఎంఈ

మంజూరైన 161 సీట్లను 2026ఉ27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. కాగా, గత విద్యా సంవత్సరంలో 13 ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి 150 పీజీ వైద్య సీట్ల కోసం ప్రతిపాదనలు పంపగా.. ఎన్ఎంసీ 142 సీట్లకు మాత్రమే అనుమతులు మంజూరు చేసింది. ఈ ఏడాది ఏకంగా 161 సీట్లు సాధించడం ప్రభుత్వ వైద్య విద్యా రంగంలో మరో ముందడుగుగా నిలిచింది.

వారంలోగా నోటిఫికేషన్

పెండింగ్ 23 మున్సిపాలిటీలకు ఎన్నికలు
ఇప్పటికే పూర్తయిన రిజర్వేషన్లు.. 25లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి!

విజయవాడ, నవంబర్ 6 (సమయం న్యూస్) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. మేయర్, ఛైర్‌పర్సన్‌లతో పాటు డివిజన్లు, వార్డు స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ కూడా పూర్తయింది. ఈ నెల 10 నుంచి 12వ తేదీల మధ్య ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. 25వ తేదీ లోపు మొత్తం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉంది. ఈ 23 పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో అక్టోబర్ 14న జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌లో వీటి ప్రస్తావన లేదు. తాజాగా ఆ కేసుల పరిష్కారం కావడంతో వీటిలో కూడా ఎన్నికల నిర్వహణకు పురపాలక శాఖ అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. డివిజన్లు, వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియను ముగించారు. ఆ జాబితాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళల గుర్తింపును పూర్తి చేసిన అధికార యంత్రాంగం.. తాజాగా రిజర్వేషన్లను కూడా ఖరారు చేసింది. శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, కాకినాడ,



మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లతో పాటు ఆముదాలవలస, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, గూడూరు, కందుకూరు, కావలి, నరసరావుపేట, పొన్నూరు, రాజాం, శ్రీకాళహస్తి, తాడిగడప, బాపట్ల, అల్లూరు, చింతలపూడి, పొదిలి, బి.కొత్తపేట మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఈ దఫాలో ఎన్నికలు జరగనున్నాయి.

చీరాల ఫలితాలతో కాంగ్రెస్‌లో చిగురించిన ఆశలు


మున్సిపల్ ఎన్నికల్లో 10 వార్డులు కైవసం
పలుచోట్ల రెండో స్థానంతో సత్తాచాటిన హస్తం
మూడో స్థానానికి పడిపోయిన వైఎస్సార్ కాంగ్రెస్
ఆమంచి కృష్ణమోహన్ చొరవతో మళ్లీ చిగురించిన ఆశలు
మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకున్న తెలుగుదేశం



చీరాల, నవంబర్ 6 (సమయం న్యూస్) : రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఎక్కడా చెప్పుకోదగ్గ విజయాలు లేకపోయినా.. బాపట్ల జిల్లా చీరాల మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ అనూహ్య సత్తా చాటింది. మొత్తం 44 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ ఏకంగా 10 స్థానాల్లో విజయం సాధించి రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. పలు వార్డుల్లో రెండో స్థానంలో నిలిచి బలమైన పోటీ ఇచ్చింది. అదే సమయంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 8 స్థానాలకే పరిమితమై.. పలు వార్డుల్లో మూడో స్థానానికి పడిపోవడం గమనార్హం. మరోవైపు అధికార తెలుగుదేశం పార్టీ 22 స్థానాల్లో గెలుపొంది చీరాల మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ స్థాయిలో సత్తా చాటడానికి మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ మళ్లీ ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లడమే ప్రధాన కారణమని స్థానికులు విశ్లేషిస్తున్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆమంచి బరిలోకి దిగితే తెలుగుదేశం పార్టీకి టఫ్ ఫైట్ తప్పకపోవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

చీరాలలో మారుతున్న సమీకరణాలు..

చీరాల అసెంబ్లీ స్థానంలో గత రెండు పర్యాయాలుగా తెలుగుదేశం పార్టీనే విజయం సాధించింది. 2014లో ఇండిపెండెంటెంట్‌గా పోటీ చేసిన ఆమంచి కృష్ణమోహన్ ఎమ్మెల్యేగా గెలిచి, అనంతరం టీడీపీలో చేరారు. 2019 ఎన్నికలకు ముందు ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన కరణం బలరామకృష్ణమూర్తి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే ఆ తర్వాత కరణం బలరాం టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ తర్వాత 2024లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన బలరాం కుమారుడు కరణం వెంకటేశ్ ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఆమంచి కృష్ణమోహన్ మూడో స్థానంలో నిలవగా.. టీడీపీ అభ్యర్థి మద్దులూరి కొండయ్య ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే గత ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఏకంగా 10 వార్డులు గెలుచుకుని, వైసీపీని వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరుకోవడం చీరాల రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరతీసింది.



1	1	342	469	379						0
3	2	704		503						
9	5	229	185	722						
11	6	166	352	556						
17	9	319	255	493						3
19	10	564	200	306			2			0
25	13	426		640						
27	14	134	227	596						
33	17	439	412	125						
35	18	363	155	333						
41	21	46	672	462			5			
43	22	86	265	692						
49	25	256	371			323				
51	26	78	137	846						
57	29	266	167	777						
59	30	138	347	723						
65	33	404	464	336					28	
67	34	692	100	390						
73	37	121	255	884						
75	38	367	404	531						

సంపాదకీయం



స్టాక్ మార్కెట్‌లో లాభాల జాతర!

ఒక్కరోజే 1,718 పాయింట్లు దూసుకెళ్లిన సెన్సెక్స్

మళ్లీ 25 వేల మార్కును అధిగమించిన నిఫ్టీ

వరుసగా ఏడో రోజూ లాభాల్లో ముగిసిన దేశీయ సూచీలు

భారీగా కొనుగోళ్లకు దిగిన విదేశీ సంస్థాగత మదుపర్లు

ఒక్కరోజే రూ.14,975 కోట్ల విదేశీ పెట్టుబడులు

బ్యాంకింగ్, ఆటోమొబైల్ షేర్లకు భారీగా కొనుగోళ్ల మద్దతు

ముంబయి, నవంబర్ 6 (సమయం న్యూస్): దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు ఎదురైనప్పటికీ భారతీయ సూచీలు దూకుడు ప్రదర్శించాయి. వరుసగా ఏడో ట్రేడింగ్ రోజూ లాభాలను నమోదు చేస్తూ మదుపర్లలో ఉత్సాహాన్ని నింపాయి. విదేశీ సంస్థాగత మదుపర్ల భారీ కొనుగోళ్లు, ప్రముఖ కంపెనీల మెరుగైన త్రైమాసిక ఫలితాలు, బ్యాంకింగ్, ఆటోమొబైల్ రంగాల షేర్లకు పెరిగిన డిమాండ్ సూచీల పరుగుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ క్రమంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ ఏకంగా 1,718.01 పాయింట్లు ఎగబాకగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ మళ్లీ 25 వేల పాయింట్ల కీలక స్థాయిని అధిగమించింది. గురువారం 79,310.01 పాయింట్ల వద్ద ముగిసిన సెన్సెక్స్ శుక్రవారం ఉదయం 79,413.66 పాయింట్ల వద్ద స్వల్ప లాభంతో ట్రేడింగ్ ప్రారంభించింది. ప్రారంభంలో కొంత అప్రమత్తత కనిపించినప్పటికీ కొద్దిసేపటికే కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటోమొబైల్, వినియోగ వస్తువుల రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీల షేర్లలో కొనుగోళ్ల మద్దతు పెరగడంతో సూచీ వేగంగా పుంజుకుంది. చివరకు సెన్సెక్స్ 1,718.01 పాయింట్ల భారీ లాభంతో 81,028.02 పాయింట్ల వద్ద ముగిసింది. ఇదే సమయంలో నిఫ్టీ 493.75 పాయింట్లు పెరిగి 25,030 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93.89గా నమోదైంది. సెన్సెక్స్‌లోని 30 ప్రధాన కంపెనీల షేర్లలో పవర్‌గ్రిడ్ మినహా మిగిలినవన్నీ లాభాల్లో ముగియడం విశేషం. మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా రాణించాయి. బ్యాంకింగ్ రంగంలోని దిగ్గజ సంస్థల షేర్లకు భారీగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల పెరుగుదలకు బలమైన ఊతం లభించింది. ఆటోమొబైల్, ఇతర ప్రముఖ కంపెనీల షేర్లు కూడా లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో కృత్రిమ మేధ రంగానికి సంబంధించిన కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్న సమయంలో భారత మార్కెట్లు విభిన్నంగా స్పందించడం విశేషంగా మారింది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కృత్రిమ మేధ సాంకేతికతపై నియంత్రణలు కఠినతరం కావచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా కొన్ని సాంకేతిక రంగ కంపెనీల షేర్లపై ఒత్తిడి పెరిగినట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే కృత్రిమ మేధ రంగంపై అధికంగా ఆధారపడిన మార్కెట్లతో పోలిస్తే భారతీయ మార్కెట్లలో ఇతర రంగాల కంపెనీలకు ప్రాధాన్యం ఉండటం పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడుతోందని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాన్ని మార్కెట్ వర్గాలు 'యాంటీ ఏఐ' ధోరణిగా అభివర్ణిస్తున్నాయి. దేశీయ సూచీల భారీ పెరుగుదలకు విదేశీ సంస్థాగత మదుపర్ల కొనుగోళ్లు మరో ప్రధాన కారణంగా నిలిచాయి. గురువారం ఒక్కరోజే విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.14,975 కోట్ల విలువైన షేర్లను నికరంగా కొనుగోలు చేసినట్లు మార్కెట్ గణాంకాలు వెల్లడించాయి. గత ఆరేళ్లలో ఒకేరోజు ఈ స్థాయిలో విదేశీ పెట్టుబడులు రావడం ఇదే తొలిసారి అని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరగడంతో దేశీయ మదుపర్లలోనూ విశ్వాసం బలపడింది. ముఖ్యంగా భారీ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల షేర్లకు డిమాండ్ పెరిగింది. మరోవైపు కంపెనీల రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు కూడా మార్కెట్‌కు అనుకూలంగా మారాయి. పలు ప్రముఖ కంపెనీలు అంచనాల కంటే మెరుగైన ఫలితాలను ప్రకటించడం మదుపర్లలో సానుకూల ధోరణిని పెంచింది. గత కొంతకాలంగా ధరలు తగ్గిన భారీ కంపెనీల షేర్లు ప్రస్తుత స్థాయిల్లో ఆకర్షణీయంగా కనిపిస్తుండటంతో పెట్టుబడిదారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటోమొబైల్ రంగాల్లో కొనుగోళ్లు పెరగడం సూచీలకు కలిసొచ్చింది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారత మార్కెట్లు వరుసగా ఏడో రోజు లాభాలను నమోదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఒక్కరోజు భారీ పెరుగుదల నమోదైనంత మాత్రాన ఇదే ధోరణి నిరంతరం కొనసాగుతుందని చెప్పలేమని మార్కెట్ నిపుణులు గుర్తుచేస్తున్నారు. అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, కంపెనీల ఆర్థిక ఫలితాలు, వడ్డీ రేట్లపై నిర్ణయాలు రాబోయే రోజుల్లో సూచీల గమనాన్ని ప్రభావితం చేసే అవకాశముంది. ప్రస్తుతానికి మాత్రం సెన్సెక్స్ భారీ పరుగుతో, నిఫ్టీ 25 వేల మార్కు అధిగమనంతో దేశీయ స్టాక్ మార్కెట్లలో ఉత్సాహం నెలకొంది.



ప్రభుత్వ పథకాల లబ్ధికి ఓటర్ ఐడీ

- **బీజేపీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు!**
- **ఓటర్ల జాబితాల ఆధారంగా లబ్ధిదారుల ఎంపికపై అభ్యంతరం**
- **ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై మరోసారి విమర్శలు**
- **జ్ఞానేశ్ కుమార్ పాత్రను ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత**
- **కేంద్ర మంత్రి లలన్ సింగ్ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం**



న్యూదిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్):కేంద్రంలో శాశ్వతంగా అధికారంలో కొనసాగేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికలను తారుమారు చేసి ప్రజల ప్రాథమిక ఓటు హక్కును, హక్కులను హరించేందుకు పెద్ద కుట్ర పన్నుతోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను నిర్ధారించడానికి ఇకపై ఆధార్ కార్డులకు బదులుగా ఓటర్ ఐడీ కార్డులను, బయోమెట్రిక్‌ను ఉపయోగిస్తామని కేంద్ర మంత్రి లలన్ సింగ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ గాంధీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు.ఆధార్‌కు బదులుగా ఓటర్ ఐడీ ఆధారంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేయడం పౌరుల ప్రాథమిక హక్కులకు తీరని ముప్పు కలిగిస్తుందని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలను పొందడాన్ని ఓటర్ల జాబితాలతో ముడిపెడుతున్నారని, అయితే ఆ జాబితాలను ఇప్పటికే ప్రభుత్వం తన అనుకూలంగా తారుమారు చేస్తోందని ఆరోపించారు. బీజేపీని వ్యతిరేకించే లేదా నిలదీసే లక్షలాది మంది ఓటర్ల పేర్లను తొలగించడానికి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను నిరంతరం ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీపై ఆగ్రహంతో ఉన్న ప్రజలనే లక్ష్యంగా చేసుకుని ఓట్ల నుంచి తొలగించి, సంక్షేమ పథకాల ప్రయోజనాలను కూడా నిరాకరించే పరిస్థితిని కల్పిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలను ప్రభుత్వం పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకుందన్న రాహుల్ గాంధీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పాత్రనూ ప్రత్యక్షంగా ప్రశ్నించారు. "ఓటర్ల జాబితాలు నిష్పక్షపాతంగా వ్యవహరించే స్వతంత్ర ఎన్నికల సంఘం చేతిలో ఉండాలి. కానీ ఇప్పుడు అవి మోదీ ప్రభుత్వ ప్రతినిధి జ్ఞానేశ్ కుమార్ చేతిలో ఉన్నాయి. ఓట్ల చోరీలో బీజేపీతో కుమ్మక్కైన ఆయనను ఆధారాలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం" అని విమర్శించారు. ఎల్లప్పుడూ బీజేపీకే మెజారిటీ వచ్చేలా జాబితాను రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని, ఇప్పుడు అదే జాబితా పేదలకు పథకాలు అందాలో లేదో నిర్ణయించడం హైజాక్ చేయబడిన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని అన్నారు. ఇక్కడ ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం లేదని, ప్రభుత్వమే తనకు అనుకూలమైన ప్రజలను ఎన్నుకుంటోందని ఆయన ఆరోపించారు. కాగా, రాహుల్ గాంధీ తన పోస్టుతో పాటు షేర్ చేసిన వీడియోలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి లలన్ సింగ్ మాట్లాడారు. "ఇకపై లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల చెల్లింపుల కోసం ఆధార్ కార్డు ప్రాతిపదికగా ఉండదు. ప్రతి వీధిలోని సంస్థల్లో ఇప్పుడు ఆధార్ కార్డు అందుబాటులో ఉంది. వారిని అడిగితే చాలు, ఐదు నిమిషాల్లో మీకు నకిలీ ఆధార్ కార్డును కూడా సిద్ధం చేసి ఇస్తారు. కాబట్టి ఇకపై ఆధార్ కార్డు ప్రాతిపదిక కానే కాదు. లబ్ధిదారులందరికీ చెల్లింపుల కోసం బయోమెట్రిక్, ఓటర్ ఐడీ నంబరే ప్రధాన ప్రాతిపదికగా ఉంటాయి. వాటి ఆధారంగానే సంక్షేమ నిధుల చెల్లింపులు జరుగుతాయి" అని వెల్లడించారు.



దీపావళి వేడుకల్లో బాధ్యత అవసరం

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు!

న్యూ ఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్): ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో ప్రమాదకరంగా పెరిగిన వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం కోర్టు ఆంక్షలు, ప్రభుత్వ ఆదేశాలతో సమస్య తీరదని, ప్రజల ప్రవర్తనలో స్వచ్ఛంద మార్పు రావాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. దీపావళి వంటి పండుగలను పర్యావరణానికి హాని కలగకుండా సాంప్రదాయబద్ధంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని సూచించింది. విచారణలో భాగంగా పండుగల అతి వాణిజ్యీకరణ కూడా కాలుష్యానికి ఒక కారణమని జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీ పేర్కొన్నారు. కాలుష్యానికి పేదలను బాధ్యులను చేయడం సరికాదని సీజేఐ స్పష్టం చేశారు. సంపన్నులు వాడే ప్రైవేట్ వాహనాల వల్ల పెరిగే రవాణా రంగ పొగే ప్రధాన కారణమని అమికస్ క్యూరీ తెలిపారు. అలాగే పంట వ్యర్థాల (పరాలీ) దహనం నివారణకు కొనుగోలు ధర ముందే ప్రకటించి, నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించాలని ఆదేశించింది. బీఎస్-6 లేని వాహనాలపై ఆంక్షలు, డీజిల్ ఆటోల తొలగింపు వంటి చర్యలను కేంద్రం వివరించినప్పటికీ, ఏక్యూఐ 400 దాటడంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కాలుష్య నివారణకు ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల పర్యావరణ బాధ్యత కూడా అత్యంత కీలకమని ధర్మాసనం ఆదేశించింది.

మరో అవకాశం!

ఓటు గల్లంతైన వారికి ఈసీ మరో చాన్స్!

ముసాయిదా జాబితాలో పేరు లేకున్నా చేర్చుకునే అవకాశం

తెలుగు రాష్ట్రాలు సహా ఏడు రాష్ట్రాల ఎన్నికల అధికారులకు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్): ఓటర్ల జాబితాలో తమ పేరు కనిపించక ఆందోళన చెందుతున్న వారికి కేంద్ర ఎన్నికల సంఘం తీపి కబురు అందిస్తూ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినా అర్హులైన పౌరులు తుది జాబితాలో తమ పేరును నమోదయ్యేలా చూసుకునేందుకు మరొక అవకాశం కల్పించాలని భావించింది. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి తెలుగు రాష్ట్రాలతో సహా మొత్తం ఏడు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు అత్యంత కీలకమైన అధికారిక ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా గైర్హాజరు, నివాస మార్పు, మరణం, నకిలీ నమోదులు వంటి కారణాలతో ఏఎస్‌డీఈ జాబితాలో చేరిన వారి వివరాలను మరోసారి నిశితంగా పరిశీలించాలని ఆదేశించింది. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని గట్టిగా స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణలో భాగంగా గైర్హాజరైనవారు, వేరే ప్రాంతాలకు నివాసం మార్చుకున్నవారు, మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైనవారిని గుర్తించి ప్రత్యేక జాబితాలను అధికారులు రూపొందిస్తున్నారు. అయితే ఈ సమగ్ర ప్రక్రియలో కొందరు అర్హులైన పౌరుల పేర్లు కూడా పొరపాటున జాబితాల నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రత్యేక జాబితాలను మరోసారి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గైర్హాజరు, నివాస మార్పు, నకిలీ నమోదుల కింద గుర్తించిన ఓటర్ల వివరాలను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ ఆఫీసులు, పురపాలక కార్యాలయాల్లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచాలని పేర్కొంది. తద్వారా తమ పేరు ఏ కారణంతో ప్రత్యేక జాబితాలో చేరిందో పౌరులు స్పష్టంగా తెలుసుకుని, పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునే వీలు కలగనుంది. అలాగే ఒకే రాష్ట్ర పరిధిలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి నివాసాన్ని మార్చుకున్న ఓటర్లకు దరఖాస్తు ప్రక్రియలో ప్రత్యేక వెసులుబాటు లభించింది. అలాంటి వారు సంక్లిష్టమైన ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేకుండానే ఎన్యూమరేషన్ ఫారం, చిరునామా ధ్రువీకరణ పత్రం సమర్పించి తమ వివరాలను ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చు. పాత ఓటరు గుర్తింపు కార్డు నంబరును ఉపయోగించి యాప్ లేదా ఈసీఐ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సులభంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు తుది జాబితాలో ఉండేలా పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఇంటింటి పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. వివరాలను పరిశీలించి దరఖాస్తులను సేకరించాలని సూచించారు. గుర్తింపు కార్డు ఉన్నంత మాత్రాన స్వయంచాలకంగా ఓటు వేసే అర్హత ఉండదని, తుది ఓటర్ల జాబితాలో పేరు ఉండటం తప్పనిసరని హెచ్చరించారు. ముసాయిదా జాబితాలో పేరు కనిపించకపోతే ఆందోళన చెందకుండా ఈసీఐ అధికారిక సేవల పోర్టల్ ద్వారా వివరాలు పరిశీలించుకుని, గడువులోగా దరఖాస్తులను పూర్తి చేసుకోవాలని నిపుణులు కోరుతున్నారు.

కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో భారీ అగ్నిప్రమాదం

- **మంటల్లో చిక్కుకుని నాలుగు బోగీలు దగ్ధం**
- **పంజాబ్‌లోని సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపంలో ఘటన**
- **అప్రమత్తమైన లోకో పైలట్.. సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు**
- **ప్రాణనష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు**



చండీగఢ్, నవంబర్ 6 (సమయం న్యూస్): పంజాబ్‌లో ప్రయాణికులతో వెళ్తున్న కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపంలో రైలులోని ఓ బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి పక్కనున్న మరో మూడు బోగీలకు వ్యాపించాయి. దీంతో మొత్తం నాలుగు బోగీలు మంటల్లో చిక్కుకున్నాయి. ఈ ఘటనతో రైలులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే లోకో పైలట్ అప్రమత్తంగా వ్యవహరించి రైలును నిలిపివేయడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడినట్లు సమాచారం. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అందిన వివరాల ప్రకారం అమృత్‌సర్ నుంచి న్యూ జల్పాయ్‌గురి వైపు వెళ్తున్న 12508 నంబర్ కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రైలు సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపానికి చేరుకున్న సమయంలో ఇంజిన్ నుంచి ఐదో బోగీలో తొలుత మంటలు కనిపించాయి. కొద్దిసేపటికే మంటలు వేగంగా వ్యాపించి సమీపంలోని మరో మూడు బోగీలను చుట్టుముట్టాయి. బోగీల నుంచి పెద్దఎత్తున పొగలు ఎగిసిపడటంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రమాదాన్ని గుర్తించిన లోకో పైలట్ వెంటనే రైలును నిలిపివేసినట్లు సమాచారం. దీంతో ప్రయాణికులు బోగీల నుంచి బయటకు దిగారు. మంటలు మరింత విస్తరించకముందే ప్రయాణికులు సురక్షిత ప్రాంతానికి చేరుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదం కారణంగా నాలుగు బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాయి. బోగీల నుంచి పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటంతోపాటు దట్టమైన పొగలు వ్యాపించడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన ప్రాంతంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు రైల్వే సిబ్బంది చర్యలు చేపట్టారు. మరోవైపు అగ్నిప్రమాదానికి గల కారణాలపై రైల్వే అధికారులు విచారణ ప్రారంభించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరమే వెల్లడయ్యే అవకాశం ఉంది. బోగీల్లోని విద్యుత్ వ్యవస్థ, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించనున్నట్లు సమాచారం. ఈ ఘటనతో రైళ్లలో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకుంటున్న భద్రతా చర్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ప్రయాణికులతో వెళ్తున్న రైలులో ఒక బోగీ నుంచి మరో బోగీకి మంటలు వేగంగా వ్యాపించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదానికి కారణమైన పరిస్థితులను గుర్తించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదంలో దెబ్బతిన్న బోగీల వివరాలు, రైలు ప్రయాణం పునరుద్ధరణకు సంబంధించిన పూర్తి సమాచారం అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.



బాల్య వివాహాలకు చెక్!

2030 నాటికి రహిత దేశంగా మార్చడమే లక్ష్యం

ఉధృతంగా 'బాల వివాహ్ ముక్త్ భారత్' ప్రచారం

20.1 శాతానికి పడిపోయిన బాల్య వివాహాల రేటు

దేశవ్యాప్తంగా 12 కోట్లకు పైగా ప్రజల్లో అవగాహన

న్యూఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్): దేశంలో బాల్య వివాహాలనే సామాజిక దురాచారాన్ని పూర్తిగా రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టింది. 2030 సంవత్సరం నాటికి భారతదేశాన్ని బాల్య వివాహ రహిత దేశంగా మార్చాలనే బృహత్తర లక్ష్యంతో 'బాల వివాహ్ ముక్త్ భారత్' పేరుతో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తోంది. కేంద్రం తీసుకుంటున్న కఠిన చర్యలు, అవగాహన కార్యక్రమాలతో క్రమంగా సత్ఫలితాలు వస్తున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్హెచ్ఎస్-5) లెక్కల ప్రకారం గతంలో 23.3 శాతంగా ఉన్న బాల్య వివాహాల రేటు.. తాజా సర్వే (ఎన్ఎఫ్హెచ్ఎస్-6) నాటికి 20.1 శాతానికి గణనీయంగా తగ్గింది. ప్రజలను చైతన్యపరచడంలో భాగంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 6.85 లక్షల అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించింది. తద్వారా ఏకంగా 12.47 కోట్ల మందిని చైతన్యపరిచింది. బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోమని 42.01 లక్షల మందితో ప్రతిజ్ఞ చేయించింది. చైతన్యం తీసుకురావడంతో పాటే చట్టాలను కూడా ప్రభుత్వం కఠినంగా అమలు చేస్తోంది. బాల్య వివాహాలకు సంబంధించి ఇప్పటివరకు 4,536 ఘటనలు ప్రభుత్వ పోర్టల్లో నమోదయ్యాయి. ఆయా కేసుల్లో కఠిన చర్యలు తీసుకుంటున్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం-2006 ప్రకారం.. ఈ నేరాలకు పాల్పడే వారికి రెండేళ్ల వరకు కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉందని, ఎవరూ ఉల్లంఘనలకు పాల్పడవద్దని అధికారులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

ఆక్వా రంగానికి తొలగిన చీకట్లు!

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు

నూరు శాతం పూర్తయిన గృహ విద్యుత్ కనెక్షన్లు

16,809 ఆక్వా సర్వీసులకు కరెంట్ సరఫరా

విద్యుత్ శాఖకు రూ. 50.49 కోట్ల నష్టం అంచనా

కలెక్టర్తో కలిసి సమీక్షించిన ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

భీమవరం, నవంబర్ 6 (సమయం న్యూస్): అర్నబ్ తుఫాను కారణంగా పశ్చిమగోదావరి జిల్లాలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి స్పష్టం చేశారు. శుక్రవారం భీమవరంలోని వశిష్ట సమావేశ మందిరంలో ఆక్వా రంగానికి విద్యుత్ పునరుద్ధరణపై ఆక్వా అసోసియేషన్ రైతులు, విద్యుత్, మత్స్య శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని పశ్చిమగోదావరి జిల్లాలో దెబ్బతిన్న విద్యుత్ సరఫరాను గాడిలో పెట్టేందుకు వేగంగా చర్యలు చేపట్టామన్నారు. జిల్లావ్యాప్తంగా గృహాలు, ఆక్వా, వ్యవసాయ రంగాలకు కరెంట్ సరఫరాను పునరుద్ధరించామని తెలిపారు. సిబ్బంది, పరికరాలు చేరవేయడానికి ఇబ్బందిగా ఉన్న మారుమూల ప్రాంతాల్లో కూడా త్వరలోనే పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.

నూరు శాతం గృహ విద్యుత్ సరఫరా..



తుఫాను ప్రభావానికి గురైన ఆరు విభాగాలు, 20 మండలాల్లోని 409 గ్రామాల్లో గృహ విద్యుత్ సరఫరాను 100 శాతం పునరుద్ధరించినట్లు సీఎండీ వెల్లడించారు. జిల్లాలో మొత్తం 17,584 ప్రభావిత ఆక్వా సర్వీసులకు గాను.. ఇప్పటికే 16,809 సర్వీసులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించామన్నారు. మిగిలిన 775 ఆక్వా సర్వీసులతో పాటు వ్యవసాయ పంపుసెట్లకు కూడా త్వరలో పూర్తిస్థాయిలో సరఫరా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. జిల్లాలో తుఫాను ప్రభావానికి గురైన 98 విద్యుత్ ఉపకేంద్రాల్లో పునరుద్ధరణ పనులు వంద శాతం పూర్తయ్యాయన్నారు. ప్రభావితమైన 67 (33 కేవీ) విద్యుత్ లైన్లలో 66 లైన్లను, 475 (11 కేవీ) విద్యుత్ లైన్లలో 473 లైన్లను పునరుద్ధరించినట్లు తెలిపారు. మిగిలిన లైన్ల పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. నేలకూలిన స్తంభాలను, లైన్లపై పడిన చెట్లను తొలగించి భారీ స్థాయిలో కొత్త లైన్ల ఏర్పాటు పనులు చేపట్టామన్నారు.

రూ. 50 కోట్ల భారీ నష్టం..

జిల్లావ్యాప్తంగా 226 బృందాలకు చెందిన 3,254 మంది అధికారులు, విద్యుత్ సిబ్బంది అహోరాత్రులు నిరంతరం పునరుద్ధరణ పనుల్లో పాల్గొంటున్నారని సీఎండీ వివరించారు. ఈ తుఫాను కారణంగా విద్యుత్ రంగానికి ప్రాథమిక అంచనా ప్రకారం రూ. 50.49 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు జాగ్రత్తలు, అధికారుల సమన్వయ చర్యల కారణంగా ఎలాంటి ప్రాణ, పశు నష్టం జరగలేదన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ.. తుఫాను ప్రభావంతో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ విద్యుత్, ఇతర శాఖల సమన్వయంతో త్వరితగతిన లైన్ల పునరుద్ధరణ జరిగిందని అభినందించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమర్థవంతంగా పని చేశాయని ప్రశంసించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డైరెక్టర్ సూర్య ప్రకాష్, ఎస్ఈ పి.ఉషారాణి, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు, ఆక్వా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలుంటే ఈ నంబర్లకు కాల్ చేయండి:

జిల్లాలో ఎక్కడైనా గృహాలకు విద్యుత్ సరఫరా లేకపోయినా, ఇతర విద్యుత్ సమస్యలు తలెత్తినా వెంటనే ఈ కింది కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

క్యాన్సర్ మందుల ధరలు భారీగా తగ్గింపు!

- **20 నుంచి 70 శాతం వరకు తగ్గిన ఎంఆర్పీలు**
- **137 రకాల మందులపై ట్రేడ్ మార్జిన్ 30 శాతానికి పరిమితి**
- **నవంబర్ 9 నుంచి అమల్లోకి రానున్న కొత్త ధరలు**
- **రోగులకు ఏటా రూ.3,357 కోట్ల మేర ఆర్థిక ఊరట**



న్యూఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్): క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ప్రాణాంతక క్యాన్సర్ చికిత్సను సామాన్యులకు మరింత అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో కీలక నిర్ణయం తీసుకుంది. 137 రకాల నాన్-షెడ్యూల్డ్ క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్ను గరిష్ఠంగా 30 శాతానికి కేంద్రం పరిమితం చేసింది. దీంతో ఆయా మందుల ఎంఆర్పీలు సగటున 20 నుంచి 70 శాతం వరకు భారీగా తగ్గాయి. కొన్ని మందులపై ఏకంగా 96.45 శాతం వరకు అత్యధికంగా ధర తగ్గింపు నమోదు కావడం విశేషం. ఈ కొత్త ధరలు ఈ నెల (నవంబర్) 9వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి.

కేంద్రం తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో క్యాన్సర్ రోగులకు ఏటా సుమారు రూ.3,357.49 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గనుందని అంచనా వేస్తున్నారు. నవంబర్ 4వ తేదీ నాటికి 70 ఫార్మా కంపెనీలు 120 మందులకు సంబంధించి 1,136 ఎస్క్యూయూల కొత్త ఎంఆర్పీలను ప్రభుత్వానికి సమర్పించాయి. ఆసుపత్రులు, మెడికల్ షాపుల నిర్వాహకులు ఈ కొత్త ధరల పట్టికను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాల్సి ఉంటుందని అధికారులు ఆదేశించారు. ఈ మందుల ధరలను ఎన్పీపీఏ అధికారిక వెబ్సైట్, 'ఫార్మా సహీ దామ్' మొబైల్ యాప్ ద్వారా ప్రజలు నేరుగా పరిశీలించుకునే అవకాశాన్ని కల్పించారు.

ఆయుష్మాన్ భారత్ పీఎం-జేఏవై పథకం కింద కూడా క్యాన్సర్ చికిత్సకు నగదు రహిత వైద్య సేవలు అందుతున్నాయని పీఐబీ ఒక ప్రకటనలో తెలిపింది. నవంబర్ 4 నాటికి మెడికల్ ఆంకాలజీ విభాగానికి సంబంధించి దేశవ్యాప్తంగా 19.5 లక్షల ఆసుపత్రి అడ్మిషన్లకు, సుమారు రూ.2,926 కోట్ల విలువైన చికిత్సలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. క్యాన్సర్ స్క్రీనింగ్, నాణ్యమైన చికిత్స, అత్యంత తక్కువ ధరకు మందుల సరఫరా లాంటి పకడ్బందీ చర్యల ద్వారా దేశవ్యాప్తంగా సామాన్యులందరికీ క్యాన్సర్ వైద్యాన్ని మరింత చేరువ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని కేంద్రం స్పష్టం చేసింది.

తల్లిదండ్రుల జీతమొక్కటే కొలమానం కాదు!

- **ఓబీసీ క్రీమీలేయర్పై సుప్రీంకోర్టు కీలక స్పష్టత**
- **ఉద్యోగ హోదా, కేటగిరీ పరిశీలన తప్పనిసరి**
- **పూర్తయిన నియామకాలకు రక్షణ**
- **సివిల్ సర్వీసెస్-2025 ఎంపికలకు కొత్త రూల్స్**



న్యూఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్): ఓబీసీ క్రీమీలేయర్ అర్హత నిర్ణయంపై సుప్రీంకోర్టు కీలక స్పష్టత ఇచ్చింది. కేవలం తల్లిదండ్రుల జీతాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని అభ్యర్థులను క్రీమీలేయర్ పరిధిలోకి తీసుకురావడం సరికాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. వారి ఉద్యోగ హోదా, పోస్టు కేటగిరీని కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. అయితే ఇప్పటికే పూర్తయిన నియామకాలు, పదోన్నతులు, సీనియారిటీపై ఈ తాజా తీర్పు ప్రభావం ఏమాత్రం ఉండదని వివరించింది.

1993 ఆగస్టు 8న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారమే అర్హతను నిర్ణయించాలని కోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే వారి పిల్లలకు కూడా సమాన హోదా ఆధారంగా ఈ నిబంధనలు వర్తింపజేయాలని సూచించింది. మార్చి 11, 2026న ఇచ్చిన తీర్పుపై కేంద్రం దాఖలు చేసిన వివరణ పిటిషన్ను పరిశీలించిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే పూర్తయిన ఉద్యోగ నియామకాలు, ఎంపికలు, పదోన్నతులు, సీనియారిటీని తిరిగి సమీక్షించేందుకు ఈ తీర్పును ఆధారంగా చేసుకోరాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. అయితే పెండింగ్లో ఉన్న కేసులను సంబంధిత న్యాయస్థానాలు వాటి మెరిట్స్ ఆధారంగా నిర్ణయించవచ్చని వెల్లడించింది.

సివిల్ సర్వీసెస్ పరీక్ష2025 ద్వారా ఎంపికైన 958 మంది అభ్యర్థులకు మాత్రం ఈ తాజా మార్గదర్శకాలు వర్తిస్తాయని సుప్రీంకోర్టు పేర్కొంది. వీరికి ఇంకా సర్వీసుల కేటాయింపు పూర్తికానందున కొత్త నిబంధనల ప్రకారమే క్రీమీలేయర్ అర్హతను నిర్ణయించాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. భవిష్యత్తులో చేపట్టే నియామకాలు, ఎంపికలు, రోస్టర్ కేటాయింపుల్లోనూ ఈ మార్గదర్శకాలనే అమలు చేయాలని స్పష్టం చేసింది. అయితే.. క్రీమీలేయర్ విధానంపై కొత్త పాలసీ రూపొందించుకునే పూర్తి స్వేచ్ఛ, అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని ధర్మాసనం పేర్కొంది.

భార్యతో సహా ఏడుగురి హత్య!

- **పుట్టింటికి వెళ్తోందనే కక్షతో ఘాతుకం**
- **రెండ్రోజుల్లోనే ఏడుగురిని చంపిన క్యాబ్ డ్రైవర్**
- **మృతుల్లో ఏడేళ్ల బాలుడు కూడా..**
- **కిరాతకుడు ఇందూశేఖర్ను అరెస్టు చేసిన పోలీసులు**



బెంగళూరు, నవంబర్ 6 (సమయం న్యూస్): కుటుంబ కలహాలు ఏకంగా ఏడుగురి ప్రాణాలను బలిగొన్నాయి. భార్య తరచూ పుట్టింటికి వెళ్తోందనే తీవ్రమైన కోపంతో ఓ క్యాబ్ డ్రైవర్ కన్నబిడ్డ లాంటి బాలుడితో సహా ఏడుగురిని కిరాతకంగా హతమార్చాడు. భార్యతో పాటు ఆమె కుటుంబానికి చెందిన మరో ఆరుగురిని అతికిరాతకంగా హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. రెండ్రోజుల వ్యవధిలోనే జరిగిన ఈ దారుణ ఘటనలో ఏడేళ్ల బాలుడు కూడా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. ఈ ఘాతుకానికి పాల్పడిన ఇందూశేఖర్ అనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఇందూశేఖర్, సునీత దంపతులకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. భార్య తరచూ పుట్టింటికి వెళ్లడం, ఆమె తల్లి, సోదరులు అందుకు మద్దతు ఇవ్వడంపై నిందితుడు తీవ్ర ఆగ్రహం పెంచుకున్నాడు. ఈ విషయమై పలుమార్లు గొడవలు జరగ్గా, కుటుంబ పెద్దలు సర్దిచెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. అత్తింటి వారే తమ మధ్య విభేదాలకు కారణమని భావించిన ఇందూశేఖర్.. వారందరినీ ఒకేసారి అంతమొందించాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. పక్కా పథకం ప్రకారం తొలుత భార్య సునీత తలపై రోకలిబండతో కొట్టి దారుణంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని గుడ్డలో చుట్టి నంది హిల్స్ సమీపంలో పడేశాడు. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి, పర్యటనకు వెళ్లిందని పొరుగువారిని నమ్మించాడు.

మరుసటి రోజు తన బావమరుదులు శివకుమార్, శంకర్లను పార్టీ పేరుతో ఇంటికి పిలిచాడు. వారు వచ్చిన తర్వాత వారిపై దాడి చేసి హత్య చేశాడు. అనంతరం వారి భార్యలు దివ్య, నళిని, అత్త రూపవతితో పాటు ఏడేళ్ల బాలుడు పునీత్ను కూడా హతమార్చినట్లు విచారణలో వెల్లడైంది. హత్యల ఆనవాళ్లు కనిపించకుండా ఇంటిని రసాయనాలతో శుభ్రం చేసి రక్తపు మరకలను పూర్తిగా తొలగించాడు. మృతదేహాల తరలింపునకు కారును ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో నిందితుడి టీనేజ్ కుమార్తె పాత్ర ఏమైనా ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాల తరలింపులో ఆమెకు ప్రమేయం ఉందా అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. నళిని తల్లి శ్రీరాంపుర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఈ హత్యల విషయం వెలుగులోకి వచ్చింది. విచారణలో ఇందూశేఖర్ నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. నంది హిల్స్ పరిసరాల్లో గాలింపు చేపట్టి బాలుడు పునీత్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఆరు మృతదేహాల కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ హత్యల్లో మరెవరికైనా ప్రమేయం ఉందా అనే అంశంపైనా పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.



పోరుగు సిబ్బంది సేవలు అమోఘం!

కరెంట్ పునరుద్ధరణ కార్మికులకు మంత్రి ప్రశంసలు

తమిళనాడు, కర్ణాటక సిబ్బందితో గొట్టిపాటి ముఖాముఖి

భోజనం, వసతి సౌకర్యాలపై ఆరా తీసిన మంత్రి

సంతనూతలపాడు నియోజకవర్గంలో పనుల పరిశీలన

నాగులుప్పలపాడు, నవంబర్ 6 (సమయం న్యూస్): తుపాను ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రేయింబవళ్లు శ్రమిస్తున్న కార్మికులను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందించారు. సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని నిడమానూరు, నాగులుప్పలపాడు, వినోదరాయునిపాలెం ప్రాంతాల్లో జరుగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పనులు చేస్తున్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యుత్ సిబ్బందితో పాటు.. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నుంచి వచ్చి సేవలందిస్తున్న సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా కలుసుకుని మాట్లాడారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సిబ్బందికి కల్పిస్తున్న ఆహారం, బస సౌకర్యాల గురించి మంత్రి ఆరా తీశారు. వారికి విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన అన్ని సదుపాయాలు పక్కాగా కల్పించాలని అధికారులకు సూచించారు. విపత్కర పరిస్థితుల్లో సొంత ప్రాంతాలను, కుటుంబాలను వదిలిపెట్టి వచ్చి.. ఇక్కడ విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సేవలందిస్తున్న సిబ్బంది అంకితభావాన్ని ఆయన కొనియాడారు. చీకట్లో ఉన్న ప్రజలకు వీలైనంత త్వరగా కరెంట్ సరఫరాను పునరుద్ధరించేలా పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఆస్పత్రి నుంచే పవార్ రాజకీయం!

ఛాతీ ఇన్ఫెక్షన్‌తో చికిత్స పొందుతున్న ఎన్సీపీ అధినేత

భేటీ అయిన ప్రఫుల్ పటేల్.. మోదీ పరామర్శ

మహారాష్ట్రలో రెండు ఎన్సీపీల విలీనంపై ఊహాగానాలు

తుది నిర్ణయం తీసుకునే ఛాన్స్ సుప్రియా సూలేకే!

ఎన్డీయే వైపు మొగ్గుచూపితే ఇండియా కూటమికి ఎదురుదెబ్బే



ముంబై, నవంబర్ 6 (సమయం న్యూస్): మహారాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం చర్చంతా ఎన్సీపీ అధినేత శరద్ పవార్ చుట్టూనే తిరుగుతోంది. ఆయన ఒకవైపు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా.. రాష్ట్ర రాజకీయ చదరంగంలో ఆయన వేస్తున్న అడుగులు తీవ్ర ఆసక్తి రేపుతున్నాయి. ఛాతీ ఇన్ఫెక్షన్‌తో ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 85 ఏళ్ల పవార్‌తో ప్రత్యర్థి వర్గానికి చెందిన నేత ప్రఫుల్ పటేల్ స్వయంగా భేటీ అయ్యారు. అటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం ఆయనకు ఫోన్ చేసి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ పరిణామాలతో ఎన్సీపీ రెండు వర్గాల విలీనంపై ఊహాగానాలకు మరోసారి తెరలేచినట్లైంది. 2023లో శరద్ పవార్‌కు వ్యతిరేకంగా అజిత్ పవార్ తిరుగుబాటు చేసి పార్టీని చీల్చారు. ఆ తర్వాత ఎన్సీపీ పేరు, ఎన్నికల గుర్తును దక్కించుకున్నారు. ప్రస్తుతం ఆ వర్గానికి సునేత్రా పవార్ నాయకత్వం వహిస్తున్నారు. ఈ కీలక పరిణామాల నేపథ్యంలో విడిపోయిన ఇరు వర్గాలు మళ్లీ ఒక్కటవుతాయా? లేక శరద్ పవార్ వర్గం నేరుగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలో చేరుతుందా? అనే విషయమై రాజకీయ వర్గాల్లో తీవ్ర సందిగ్ధత నెలకొంది.

అధికారమే వ్యూహమా?

సుమారు 60 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానంలో శరద్ పవార్ ఎన్నో సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. 1999లో సోనియా గాంధీ విదేశీ మూలాలను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి ఎన్సీపీని స్థాపించారు. కానీ, అదే ఏడాది ఎన్నికల అనంతరం తిరిగి కాంగ్రెస్‌తో చేతులు కలిపి మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 2014లో బీజేపీకి మద్దతు ప్రకటించి మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచారు. 2019లో శివసేన, కాంగ్రెస్‌తో కలిసి మహావికాస్ అఘాడీ ప్రభుత్వ ఏర్పాటులోనూ పవార్ కీలకపాత్ర పోషించారు. గతం నుంచి ఆయన తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలు ఇప్పుడు ఆయన రాజకీయ వ్యూహాలపై మరోసారి చర్చకు దారితీస్తున్నాయి.

సూలే నిర్ణయమే కీలకమా?

ఎన్సీపీ రెండు వర్గాల విలీనంపై గతంలో శరద్ పవార్ సానుకూల సంకేతాలు ఇచ్చినప్పటికీ.. తుది నిర్ణయం మాత్రం తదుపరి తరం నేతలదేనని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఈ వ్యవహారంలో ఆయన కుమార్తె సుప్రియా సూలే పాత్ర మరింత కీలకం కానుందని తెలుస్తోంది. మరోవైపు అజిత్ పవార్ వర్గంలోనూ నాయకత్వం, అంతర్గత అసంతృప్తిపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఒకవేళ శరద్ పవార్ వర్గం ఎన్డీయేలో చేరినా.. రెండు ఎన్సీపీలు విలీనమై అధికార కూటమిలో భాగమైనా మహారాష్ట్ర రాజకీయ సమీకరణాలు సమూలంగా మారే అవకాశం ఉంది. అదే జరిగితే కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)లతో కూడిన మహావికాస్ అఘాడీ తీవ్రంగా బలహీనపడుతుంది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ఇండియా కూటమిపైనా ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

దేశానికే ఆదర్శంగా ఏపీ!

- **జంట తుపాన్లను దీటుగా ఎదుర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం**
- **ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడంలో సీఎం దార్శనికత**
- **విపత్తుల వేళ రక్షణ కవచాల్లా ఏపీఎస్‌డీఎంఏ, ఆర్టీజీఎస్**
- **టెక్నాలజీతో ముందస్తు హెచ్చరికలు.. సమష్టి కృషితో సత్ఫలితాలు**
- **విపత్తు నిర్వహణపై కేంద్ర బృందం సైతం ప్రశంసలు**



అమరావతి, నవంబర్ 6 (సమయం న్యూస్): గంటకు 120 కిలోమీటర్లకు పైగా వేగంతో వీచిన పెనుగాలులు.. 20 జిల్లాలను వణికించిన 'అర్నబ్', 'మురసు' జంట తుపాన్లు.. ఒకే వారంలో విరుచుకుపడిన ఈ ప్రకృతి బీభత్సాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొన్న తీరు దేశానికే ఆదర్శంగా నిలిచింది. విపత్తు ఎంత పెద్దదైనా ప్రభుత్వ దార్శనికత, పక్కా ముందస్తు వ్యూహాల ముందు చిన్నబోక తప్పలేదు. ఆపద సమయంలో సర్కార్ సకాలంలో స్పందించి, ఆస్తి, ప్రాణ నష్టాలను సమర్థవంతంగా నివారించి రాష్ట్రాన్ని సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది.

ముఖ్యమంత్రికి ఉన్న సాంకేతిక విజ్ఞత, సుదీర్ఘ అనుభవం, అంకితభావం ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు రక్షణ కవచంలా మారాయి. ఆంధ్రప్రదేశ్ నేడు సురక్షితమైన నాయకత్వంలో ఉందనే విషయాన్ని ఈ తుపాన్లు పునరుద్ఘాటించాయి. మంత్రుల నిరంతర పర్యవేక్షణ, ఐఏఎస్ అధికారుల కచ్చితమైన ప్రణాళికలు, క్షేత్రస్థాయిలో వేలాది మంది ప్రభుత్వ సిబ్బంది అహర్నిశలు చేసిన సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది.

రక్షణ కవచాల్లా సంస్థలు..

తీవ్ర తుపానుల ధాటి నుంచి ప్రజలను కాపాడటంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ), రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ప్రాణరక్షణ కవచాల్లా నిలిచాయి. ముందస్తు ప్రణాళిక, 'మనమిత్ర' వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వివిధ శాఖలను సమన్వయం చేస్తూ నష్టాన్ని కనిష్ట స్థాయికి తగ్గించడంలో కీలక పాత్ర పోషించాయి. 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించి, తుపానుల తీవ్రతను, తీరం దాటే కచ్చితమైన ప్రాంతాలను ముందే అంచనా వేశాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, శాటిలైట్ సమాచారంతో ప్రభావిత జిల్లాల ప్రజల మొబైల్ ఫోన్లకు హెచ్చరిక అలర్ట్‌లు పంపి ముందస్తుగా అప్రమత్తం చేయగలిగారు.

రికార్డు వ్యవధిలో పునరుద్ధరణ..

ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీసు, విద్యుత్, రెవెన్యూ, ఇతర శాఖల మధ్య ఆర్టీజీఎస్, ఏపీఎస్‌డీఎంఏ కల్పించిన సమగ్ర సమన్వయం సత్ఫలితాలనిచ్చింది. తుపాను తీరం దాటే సమయంలోనే రోడ్లపై పడిన చెట్లు, స్తంభాలను తొలగించి రాకపోకలను రికార్డు వ్యవధిలో పునరుద్ధరించారు. జనజీవనాన్ని వేగంగా సాధారణ స్థితికి తీసుకొచ్చారు. 'మనమిత్ర' వాట్సప్ ఆప్లికేషన్, టోల్ ఫ్రీ నంబర్లకు అందిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించారు.

లక్షలాది మందికి పునరావాసం..

ముందస్తు చర్యల్లో భాగంగా లక్షలాది మందిని సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడ బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య వసతులను నిరంతరాయంగా అందించడంలో ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసింది. ప్రభుత్వ పట్టుదల, టెక్నాలజీ వినియోగం కారణంగా విపత్తు నిర్వహణలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అర్నబ్ తుపాను పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం సైతం ప్రశంసించడం విశేషం.

ఈ20 పెట్రోల్‌లో కల్తీ!

- **కర్ణాటక సర్కార్ సంచలన ఆరోపణలు**
- **30 శాతానికి పైగా ఇథనాల్ కలుపుతున్న చమురు సంస్థలు**
- **ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌పై చర్యలకు డిమాండ్**
- **'ఆపరేషన్ నిఖార్'లో వెలుగుచూసిన విస్తుపోయే నిజాలు**
- **కేంద్రానికి రాష్ట్ర మంత్రి రిజ్వాన్ అర్షద్ విజ్ఞప్తి**



బెంగళూరు, నవంబర్ 6 (సమయం న్యూస్) : ఈ20 పెట్రోల్‌పై కర్ణాటక ప్రభుత్వం సంచలన ఆరోపణలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కంపెనీలకు చెందిన పెట్రోల్ నమూనాలను పరిశీలించగా.. నిర్దేశించిన 20 శాతం కంటే అధికంగా ఇథనాల్ ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆరోపించింది. పలు ప్రధాన చమురు కంపెనీలు సరఫరా చేస్తున్న పెట్రోల్‌లోనూ అత్యధిక స్థాయిలో ఇథనాల్ ఉన్నట్లు తాజా పరీక్షల్లో వెల్లడైనట్లు పేర్కొంది. ఈ పరీక్షలను జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న ఎన్ఏబీఎల్ ప్రయోగశాలల్లోనే నిర్వహించినట్లు రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 'ఆపరేషన్ నిఖార్' ప్రచారంలో భాగంగా ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు మంత్రి రిజ్వాన్ తెలిపారు. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపూర్, బెంగళూరు రూరల్, రామనగర, మంగళూరు, తుమకూరు జిల్లాల్లో ప్రధాన ఇంధన బ్రాండ్‌లకు చెందిన ఈ20 నమూనాలను సేకరించినట్లు పేర్కొన్నారు. అయితే, ప్రయోగశాల పరీక్షల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీఎల్) పెట్రోల్‌లో ఏకంగా 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) పెట్రోల్‌లో 30.5 శాతం మేర ఇథనాల్ గాఢత ఉన్నట్లు వెల్లడైందని ఆరోపించారు. ఈ పరిశోధనల ఫలితాలు ఇంధన నాణ్యత, వినియోగదారుల వాహనాల రక్షణ, ఇథనాల్ మిశ్రమానికి సంబంధించిన నిబంధనలపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెట్రోల్‌లో ఇథనాల్ శాతాన్ని బహిరంగంగా వెల్లడించాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ, పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రులను కర్ణాటక ప్రభుత్వం కోరింది. నిర్దేశిత పరిమితులను మించి ఇథనాల్ గాఢతతో పెట్రోల్‌ను సరఫరా చేస్తున్నట్లు తేలిన ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఇతర చమురు కంపెనీలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల స్థాయిలో ఇంధన నాణ్యత తనిఖీలు నిర్వహించి, ఆ వివరాలను బహిరంగపరచాలని కేంద్రానికి స్పష్టం చేసింది. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా తనిఖీలు, పరీక్షలు ముమ్మరం కూడా కొనసాగించి, వాటి ఫలితాలను ఎప్పటికప్పుడు బహిర్గతం చేస్తామని కర్ణాటక ప్రభుత్వం తేల్చిచెప్పింది.

శాటిలైట్లకే కళ్లుగప్పుతున్న రైతులు!

- **పంట వ్యర్థాల దహనంలో పోఖ్రాన్ తరహా వ్యూహం**
- **నాడు కలాం వాడిన టెక్నిక్‌నే వాడుతున్న వైనం**
- **ఉపగ్రహాలు వెళ్లే సమయం తెలుసుకుని దహనం**
- **పసిగట్టేందుకు 'ఫైర్ వాచ్' తెచ్చిన ఐఫారెస్ట్ సంస్థ**
- **నిరంతర నిఘాకు పార్లమెంటరీ కమిటీ సిఫారసు**



న్యూఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్) :

అమెరికా ఉపగ్రహాల నిఘా కళ్లుగప్పి నాడు పోఖ్రాన్ అణుపరీక్షలను డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దిగ్విజయంగా పూర్తి చేసిన విషయం తెలిసిందే. ఆనాడు కలాం ఉపయోగించిన ఆ టెక్నిక్‌ను ఇప్పుడు ఉత్తరాదిన కొందరు రైతులు ఫాలో అవుతున్నారు. ఉపగ్రహాల సెన్సార్లకు ఏమాత్రం చిక్కకుండా వ్యూహాత్మకంగా పంట వ్యర్థాలను దహనం చేస్తూ పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్నట్లు జాతీయ మీడియాలో వరుస కథనాలు వెలువడుతున్నాయి. ఓ భూభాగం మీదుగా వెళ్తున్నప్పుడు మాత్రమే ఉపగ్రహాలు కింద ఉన్న దృశ్యాలను చిత్రీకరించగలవని అర్థం చేసుకున్న కొందరు రైతులు.. అందుకు అనుగుణంగా తమ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఉపగ్రహాల గమనం నిర్దిష్ట సమయానుసారం ఉంటుంది. కాబట్టి తమ ప్రాంతం మీదుగా అవి ఏ సమయాల్లో వెళుతున్నాయో పక్కాగా తెలుసుకుంటున్నారు. ఆ సమయాలు దాటిన తర్వాత కళ్లుగప్పి తమ పంట వ్యర్థాలకు మంట పెట్టి పని కానిచ్చేస్తున్నారు.

చెక్‌పెట్టేలా 'ఫైర్ వాచ్' వేదిక..

ప్రస్తుతం పంట వ్యర్థాల దహనంతో చెలరేగే మంటలను పోలార్ కక్ష్యలోని నాలుగు ఉపగ్రహాల ద్వారా గుర్తిస్తున్నారు. పగటి వేళ నిర్దిష్ట సమయాల్లో అవి గంగా, సింధు నదీ పరీవాహక ప్రాంతాల మీదుగా వెళుతూ కింద కనిపించే అగ్నికీలలను గుర్తిస్తున్నాయి. అయితే రైతులు ఉపగ్రహాలు లేని సమయాల్లో మంటలు పెడుతుండటంతో.. ఆ మంటలను కూడా పసిగట్టే విధంగా 'ఫైర్ వాచ్' వేదికను 'ఐఫారెస్ట్' సంస్థ తాజాగా ఆవిష్కరించింది. ఈ వేదిక ద్వారా అటు పోలార్ ఉపగ్రహాల డేటాతో పాటు జియోస్టేషనరీ కక్ష్యలోని ఉపగ్రహాల డేటాను అనుసంధానించి.. పంట వ్యర్థాల దహనం వాస్తవంగా ఎంత విస్తీర్ణంలో జరిగిందో పక్కాగా తెలుసుకునే వీలుంటుంది.

పార్లమెంటరీ కమిటీ సిఫారసు..

వాస్తవానికి ఇలాంటి ఒక నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ గతంలోనే సిఫారసు చేసింది. జియోస్టేషనరీ కక్ష్యలోని ఉపగ్రహాల సాయంతో నిరంతరం పంట వ్యర్థాల దహనంపై ఓ కన్నేసి ఉంచే అంశాన్ని లోతుగా పరిశీలించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్‌కు సూచించింది. ఆ దిశగా ఇప్పుడు అడుగులు పడుతుండటంతో వ్యర్థాల దహనానికి అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు.

నాలుగేళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు టీమిండియా!

జనవరి 2027లో భారత జట్టు పర్యటనకు సన్నాహాలు

- మూడు వన్డేలు, మూడు టీ20ల నిర్వహణకు ప్రతిపాదనలు
- రెండుసార్లు వాయిదా పడిన పర్యటనకు ఎట్టకేలకు కదలిక
- జింబాబ్వే సిరీస్ షెడ్యూల్ మారే అవకాశం
- ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ నేపథ్యంలో తేదీల సర్దుబాటు సవాల్
- కేంద్ర ప్రభుత్వ అనుమతుల తర్వాతే తుది నిర్ణయం



న్యూఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్): దాదాపు నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండుసార్లు వాయిదా పడిన టీమిండియా బంగ్లాదేశ్ పర్యటనను జనవరి 2027లో నిర్వహించేందుకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ పర్యటనలో భాగంగా భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లతో కూడిన ఆరు పరిమిత ఓవర్ల పోటీలను నిర్వహించాలని భావిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే భారత క్రికెట్ నియంత్రణ మండలి, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఇప్పటివరకు ఈ పర్యటనపై అధికారిక ప్రకటన చేయలేదు. ఇరు బోర్డుల మధ్య చర్చలు చివరి దశకు చేరుకున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. భారత జట్టు చివరిసారిగా 2022 డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లో పర్యటించింది. ఆ సందర్భంగా ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌లు జరిగాయి. ఆ తర్వాత పలు కారణాలతో ద్వైపాక్షిక సిరీస్‌ల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది. గతంలో నిర్ణయించిన పర్యటనలు రెండుసార్లు వాయిదా పడటంతో భారత జట్టు మళ్లీ బంగ్లాదేశ్ గడ్డపై ఎప్పుడు అడుగుపెడుతుందనే ప్రశ్న నెలకొంది. తాజాగా జనవరి 2027లో పర్యటన నిర్వహించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నట్లు వార్తలు రావడంతో నాలుగేళ్ల నిరీక్షణకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే ఈ పర్యటనను భారత జట్టు ఇప్పటికే ప్రతిపాదించిన అంతర్జాతీయ మ్యాచ్‌ల కార్యక్రమంలో సర్దుబాటు చేయడం ప్రధాన సవాలుగా మారింది. జనవరి 3 నుంచి 9 వరకు జింబాబ్వేతో మూడు వన్డేల సిరీస్ నిర్వహించాల్సి ఉన్నట్లు సమాచారం. అనంతరం జనవరి 21 నుంచి ఆస్ట్రేలియాతో ప్రతిష్ఠాత్మక బోర్డర్--గవాస్కర్ ట్రోఫీ ప్రారంభం కానున్నట్లు పేర్కొంటున్నారు. ఈ రెండు సిరీస్‌ల మధ్య బంగ్లాదేశ్‌తో ఆరు మ్యాచ్‌లను నిర్వహించేందుకు తగిన సమయం లభిస్తుందా అనే అంశంపై బోర్డులు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ పర్యటనకు అవకాశం కల్పించేందుకు జింబాబ్వేతో జరగాల్సిన మూడు వన్డేల సిరీస్ తేదీలను మార్చే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక నిర్ణయం వెలువడలేదు. ఆస్ట్రేలియాతో కీలకమైన టెస్టు సిరీస్‌కు ముందు భారత ఆటగాళ్లకు తగిన విశ్రాంతి, సాధన సమయం అవసరమవుతుందని భావిస్తున్నారు. దీంతో ఆటగాళ్ల పనిభారం, ప్రయాణాలు, మ్యాచ్‌ల మధ్య విరామం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది కార్యక్రమాన్ని రూపొందించాల్సి ఉంది. మరోవైపు భారత్, బంగ్లాదేశ్ మధ్య ఇటీవల నెలకొన్న పరిణామాలు కూడా క్రికెట్ సంబంధాలపై ప్రభావం చూపినట్లు కథనాలు వెలువడ్డాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో తలెత్తిన వివాదాలు, బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌కు సంబంధించిన పరిణామాలు ఇరు దేశాల క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ఈ వివాదాల ప్రభావంతో ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాల్లో ప్రతిష్టంభన ఏర్పడినట్లు ప్రచారం జరిగింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిణామాలు, క్రికెట్ బోర్డు నాయకత్వ మార్పుల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత బోర్డుతో సంప్రదింపులు ముందుకు సాగుతున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ పరిణామాలపై ఇరు బోర్డుల నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. బంగ్లాదేశ్ పర్యటనను ఖరారు చేయడానికి ముందు బీసీసీఐ కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు పొందాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇరు దేశాల మధ్య సంబంధాలు, భద్రతా పరిస్థితులు, ఆటగాళ్ల ప్రయాణ ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. బోర్డుల మధ్య చర్చలు సానుకూలంగా ముగిసి, ప్రభుత్వ అనుమతులు లభిస్తే జనవరి 2027లో భారత జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించే అవకాశం ఉంది. అదే జరిగితే 2022 డిసెంబర్ తర్వాత దాదాపు నాలుగేళ్ల విరామానికి తెరపడినట్లవుతుంది. అయితే అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ పర్యటనను ప్రతిపాదనగానే పరిగణించాల్సి ఉంటుంది.



ప్రధాని మోదీని కలిసిన సూర్యకుమార్ యాదవ్

సతీసమేతంగా ప్రధానితో ప్రత్యేక భేటీ

ప్రపంచకప్ స్వర్ణ పతకంతో సందడి చేసిన క్రికెటర్

న్యూఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్): భారత టీ20 క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో తన భార్య దేవీశా శెట్టితో కలిసి ప్రధానిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ యాదవ్ దంపతులు ప్రధానితో కొంతసేపు ముచ్చటించారు. 2026 టీ20 ప్రపంచకప్ విజేతగా అందుకున్న స్వర్ణ పతకాన్ని సూర్యకుమార్ మెడలో ధరించి కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భేటీలో సూర్యకుమార్ దంపతులతోపాటు ఓ చిన్నారి కూడా పాల్గొంది. ఆ బాలిక కన్నడ భాషలో వినాయకుడి భక్తి కీర్తనలను ఆలపించి ప్రధాని మోదీని ఆకట్టుకుంది. చిన్నారి పాటను ప్రధాని ఆసక్తిగా విన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను ప్రధాని తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో ఆసక్తిని రేకెత్తించింది. మరోవైపు దీపావళి పండుగ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ప్రధాని మోదీ శ్రీరాముడి అయోధ్య రాకను ప్రస్తావించారు. పద్నాలుగేళ్ల వనవాసం అనంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని దీపావళి వేడుకలు నిర్వహించుకునే సంప్రదాయాన్ని గుర్తుచేశారు. దీపాల వెలుగులతో అయోధ్య నగరం, సరయూ నదీ తీరం దివ్యంగా ప్రకాశించాయని పేర్కొన్నారు. ఆ శుభప్రదమైన క్షణాలు దీపావళి వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకువచ్చాయని వివరించారు. ప్రధానితో సూర్యకుమార్ యాదవ్ దంపతుల భేటీ, చిన్నారి ఆలపించిన భక్తి గీతాలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.

సన్‌రైజర్స్‌తో సీఎస్కే భారీ ట్రేడ్ డీల్



లివింగ్‌స్టోన్‌తో పాటు మరో ఆల్‌రౌండర్ జట్టులోకి..?

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్): ఐపీఎల్ 2027 సీజన్ మినీ వేలానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీల మధ్య ఒక కీలకమైన నాలుగు ఆటగాళ్ల ట్రేడ్ డీల్ విజయవంతంగా ముగిసింది. సీఎస్కే జట్టు తమ వద్ద ఉన్న ఎడమచేతి వాటం పేసర్ ఖలీల్ అహ్మద్, ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ నాథన్ ఎల్లిస్‌లను సన్‌రైజర్స్‌కు బదిలీ చేయగా.. వారి స్థానంలో ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా యంగ్ సీమ్-బౌలింగ్ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్‌లను చెన్నై జట్టులోకి దక్కించుకుంది. గత వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ లియామ్ లివింగ్‌స్టోన్‌ను రూ. 13 కోట్లకు కొనుగోలు చేసినప్పటికీ, తాజా ట్రేడ్ ఒప్పందంలో భాగంగా అతడు రూ. 6 కోట్ల తగ్గించబడిన సవరించిన ధరకే సీఎస్కేలో చేరనున్నాడు. మరోవైపు ఆస్ట్రేలియా యువ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ తన ప్రస్తుత ఒప్పంద ధర అయిన రూ. 3 కోట్లకే చెన్నై ఫ్రాంచైజీలో చేరనున్నాడు. అదే సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఖలీల్ అహ్మద్‌ను అతని పాత కాంట్రాక్ట్ విలువ రూ. 4.8 కోట్లకు, నాథన్ ఎల్లిస్‌ను రూ. 2 కోట్లకు సొంతం చేసుకుంది. 2026 వేలంలో జాక్ ఎడ్వర్డ్స్ కోసం సీఎస్కే, సన్‌రైజర్స్ మధ్య తీవ్ర పోటీ నెలకొనగా చివరకు హైదరాబాద్ ఫ్రాంచైజీ అతడిని దక్కించుకుంది. అయితే పాదానికి తీవ్ర గాయం కావడంతో అతడు గత సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఆ వేలంలో కాంట్రాక్ట్ పొందిన అన్‌క్యాప్డ్ విదేశీ ఆటగాళ్లలో ఎడ్వర్డ్స్ ఒక్కడే కావడం గమనార్హం. ఇటీవల ఆస్ట్రేలియా తరఫున వన్డే, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఎడ్వర్డ్స్, దక్షిణాఫ్రికాతో జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన తన రెండో వన్డేలోనే ఐదు వికెట్లు పడగొట్టి తన సత్తా చాటాడు. ఇక ఖలీల్ అహ్మద్ విషయానికొస్తే అతనికి సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్తేమీ కాదు. 2018 నుంచి 2021 వరకు సన్‌రైజర్స్ తరఫున ఆడిన అతడు, 2026 ఐపీఎల్‌లో సీఎస్కే తరఫున 5 మ్యాచ్‌లు ఆడి తొడ కండరాల గాయంతో సీజన్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు మళ్లీ హైదరాబాద్ జట్టులోకి చేరి, ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి ట్రేడ్ ద్వారా వచ్చిన నటరాజన్‌తో కలిసి బౌలింగ్ విభాగంలో కీలక పాత్ర పోషించనున్నాడు. లియామ్ లివింగ్‌స్టోన్ రాకతో సీఎస్కే మిడిలార్డర్ బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ మరో బలమైన ప్రత్యామ్నాయం లభించనుంది. ఇప్పటివరకు 370 టీ20 మ్యాచ్‌ల్లో 8,595 పరుగులు సాధించడంతో పాటు ఆఫ్ స్పిన్, లెగ్ స్పిన్ బౌలింగ్‌తో 171 వికెట్లు తీశాడు. ఇటీవల యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో గ్లాస్గో కాస్మిక్ తరఫున పది ఇన్నింగ్స్‌ల్లో 219 పరుగులు చేశాడు. ఐపీఎల్ 2027 వేలానికి ముందు ఆటగాళ్ల రిటెన్షన్, విడుదల జాబితాలను సమర్పించేందుకు జట్లకు ఇచ్చిన గడువును బీసీసీఐ రెండు రోజులు పొడిగించింది. నవంబర్ 15గా ఉన్న తుది గడువును నవంబర్ 17 వరకు విస్తరించగా, ఐపీఎల్ 2027 మినీ వేలం డిసెంబర్ 16న గోవా వేదికగా నిర్వహించేందుకు నిర్ణయించారు.



విశాఖలో తొలి వన్డే..

బీసీసీఐ కీలక నిర్ణయం..

విశాఖపట్నం, నవంబర్ 6 (సమయం న్యూస్): భారత్, శ్రీలంక జట్ల మధ్య జరగనున్న ప్రతిష్టాత్మక వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ వేదిక మారింది. తొలుత ఈ మ్యాచ్‌ను దేశ రాజధాని ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ.. తాజాగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వేదికను ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి మారుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో తొలి వన్డే మ్యాచ్ డిసెంబరు 13న విశాఖపట్నంలోని ఏసీఏ వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఢిల్లీలో తీవ్రంగా నెలకొన్న వాతావరణ పరిస్థితులు, మైదానంలో చేపట్టాల్సిన పునరుద్ధరణ పనుల నేపథ్యంలో ఈ మార్పు చేసినట్లు బీసీసీఐ అధికారికంగా వెల్లడించింది. చలికాలంలో రాజధాని ఢిల్లీలో సాధారణంగా వాయు కాలుష్యం అధికంగా ఉండటంతో పాటు అరుణ్ జైట్లీ స్టేడియంలో అవుట్‌ఫీల్డ్‌ను తిరిగి సిద్ధం చేసే పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో మ్యాచ్ వేదికను మార్చాలని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) బీసీసీఐని కోరింది. డీడీసీఏ చేసిన అభ్యర్థనను తీవ్రంగా పరిశీలించిన బీసీసీఐ.. ప్రతికూల వాతావరణం వల్ల మ్యాచ్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉండడం, స్టేడియంలో ప్రతిపాదిత పునరుద్ధరణ పనుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని వేదిక మార్పునకు ఓకే చెప్పింది. డిసెంబరు 13న జరగనున్న తొలి వన్డేను విశాఖపట్నంలోనే నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. శ్రీలంక జట్టు భారత పర్యటనలో భాగంగా మొత్తం మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. డిసెంబరు 13న విశాఖపట్నంలో తొలి వన్డేతో ఈ ద్వైపాక్షిక సిరీస్ ఘనంగా ప్రారంభం కానుంది. అనంతరం రెండో వన్డే డిసెంబరు 16న బెంగళూరులో, మూడో వన్డే డిసెంబరు 19న అహ్మదాబాద్‌లో జరగనున్నాయి. వన్డే సిరీస్ ముగిసిన వెంటనే పొట్టి ఫార్మాట్ టీ20 పోటీలు ప్రారంభమవుతాయి. డిసెంబరు 22న రాజ్‌కోట్‌లో తొలి టీ20, డిసెంబరు 24న కటక్‌లో రెండో టీ20, డిసెంబరు 27న పుణెలో మూడో టీ20 జరగనుంది.

భారత్, శ్రీలంక సిరీస్ పూర్తి షెడ్యూల్:

- **డిసెంబరు 13:** తొలి వన్డే – విశాఖపట్నం
- **డిసెంబరు 16:** రెండో వన్డే – బెంగళూరు
- **డిసెంబరు 19:** మూడో వన్డే – అహ్మదాబాద్
- **డిసెంబరు 22:** తొలి టీ20 – రాజ్‌కోట్
- **డిసెంబరు 24:** రెండో టీ20 – కటక్
- **డిసెంబరు 27:** మూడో టీ20 – పుణె

ఐపీఎల్‌లో మరో సంచలనం..

రూ.40 కోట్లు కావాలంటున్న టాప్ ప్లేయర్లు!

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వేలం చరిత్రలోనే సరికొత్త సంచలనాత్మక పరిణామం చోటుచేసుకోబోతోందా అంటే అవుననే సమాధానమే ధ్వనిస్తోంది. రాబోయే మెగా వేలానికి ముందే కొందరు భారత స్టార్ ఆటగాళ్లు తమ ఫ్రాంచైజీల ముందు ఊహించని భారీ రిటెన్షన్ ఫీజు డిమాండ్లను ప్రతిపాదించినట్లు విశ్లేషణలు వస్తున్నాయి. తమను జట్టులోనే కొనసాగించాలంటే ఏకంగా రూ. 40 కోట్ల భారీ మొత్తం చెల్లించాల్సిందేనని కొందరు టాప్ ప్లేయర్లు తమ యాజమాన్యాలకు స్పష్టం చేసినట్లు ప్రముఖ క్రికెట్ వెబ్‌సైట్ క్రిక్‌బజ్ నివేదిక ద్వారా వెల్లడైంది. ప్రస్తుతం జరగనున్న ఐపీఎల్ 2027 మినీ వేలం ప్రస్తుత మూడేళ్ల వేలం సైకిల్‌లో చివరిది కానుండగా, 2028 సీజన్ కోసం రాబోయే మెగా వేలంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. సాధారణంగా మినీ వేలంలో ఫ్రాంచైజీలు కేవలం పరిమిత స్థానాలను మాత్రమే భర్తీ చేసుకోగలవు. కానీ మెగా వేలంలో మాత్రం ప్రతీ జట్టు కొత్తగా రూపకల్పన చెందాల్సి ఉంటుంది. క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. కనీసం ఇద్దరు మార్క్యూ టాప్ ప్లేయర్లు తాము జట్టులో ఉండాలంటే రూ. 40 కోట్ల ఆఫర్ ఉండాలని మెలిక పెట్టగా, మరికొందరు ఫ్రాంచైజీలను నాయకత్వ బాధ్యతలు (కెప్టెన్సీ) కూడా డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ చరిత్రలో వేలం వేదికపై ఇప్పటివరకు పలికిన అత్యధిక ధర రూ. 27 కోట్లు కాగా, 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ రిషభ్ పంత్‌ను ఈ భారీ మొత్తానికి దక్కించుకుంది. ఆ సమయానికి ఒక జట్టు యొక్క పర్స్ పరిమితి రూ. 120 కోట్లుగా ఉండగా, రాబోయే మెగా వేలం నాటికి ప్రతీ ఫ్రాంచైజీ పర్స్ పరిమితిని రూ. 150 కోట్లకు పెంచే దిశగా బీసీసీఐ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. పర్స్ రూ. 150 కోట్లకు చేరితే, ఒకే ఆటగాడికి రూ. 40 కోట్లు ఇవ్వాల్సి రావడం జట్టు మొత్తం బడ్జెట్‌లో 25 శాతానికి పైగా ఆక్రమిస్తుంది. ఇది ఫ్రాంచైజీలకు జట్టు కూర్పు విషయంలో పెద్ద సవాలుగా పరిణమించనుంది. మరోవైపు ఐపీఎల్ 2027 మినీ వేలానికి సంబంధించి ఆటగాళ్ల రిటెన్షన్, విడుదల జాబితాలను సమర్పించే గడువును బీసీసీఐ నవంబరు 17 వరకు పొడిగించింది. ఈ మినీ వేలం డిసెంబరు 16న గోవా వేదికగా జరగనుంది. ఇప్పటికే రిషభ్ పంత్ లక్నో నుంచి ఢిల్లీ క్యాపిటల్స్‌కు మళ్లీ ట్రేడ్ కాగా, కుల్దీప్ యాదవ్ లక్నోకు, టి. నటరాజన్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మారడం వంటి కీలక పరిణామాలు ట్రేడింగ్ విండోలో చోటుచేసుకున్నాయి. ఏదేమైనా ఐపీఎల్ మెగా వేలం ముంగిట స్టార్ ఆటగాళ్లు చేస్తోన్న రూ. 40 కోట్ల డిమాండ్ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.





నా వనవాసం ఎప్పుడు ముగుస్తుంది?

మాజీ భార్య ట్యాగ్‌పై నటి రేణు దేశాయ్ ఆవేదన!

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్): ప్రముఖ నటి, నిర్మాత రేణు దేశాయ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అధికారికంగా విడాకులు తీసుకుని సుమారు 14 సంవత్సరాలు పూర్తయినప్పటికీ, సమాజం ఇప్పటికీ తనను కేవలం పవన్ కల్యాణ్ మాజీ భార్యగానే చూస్తోందని, తనకంటూ ఒక స్వతంత్రమైన గుర్తింపును ఇవ్వడం లేదని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె తన వ్యక్తిగత జీవితంలోని కష్టాలు, నిరంతరం ఎదుర్కొంటున్న సోషల్ మీడియా ట్రోలింగ్‌పై మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా రేణు దేశాయ్ మాట్లాడుతూ.. "తెలుగు ప్రజలందరికీ నేను ఒకటే విన్నవించాలనుకుంటున్నాను. చాలామంది నా జీవితం కేవలం 'బద్రి' సినిమాతోనే ప్రారంభమైందని భావిస్తుంటారు. అంతకుముందు నాకు ఎలాంటి సొంత జీవితమే లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. మాకు అధికారికంగా విడాకులు వచ్చి ఇప్పటికే 14 ఏళ్లు పూర్తయ్యాయి. రామాయణంలో శ్రీరాముడు కూడా 14 ఏళ్లు మాత్రమే వనవాసం చేశాడు. మరి నా జీవితంలో సాగుతున్న ఈ మానసిక క్షోభ, ఈ మానసిక వనవాసం ఎప్పుడు ముగుస్తుంది?" అంటూ తీవ్ర భావోద్వేగంతో ప్రశ్నించారు. తన సొంత ప్రతిభ, సాధించిన విజయాల గురించి ప్రస్తావిస్తూ.. 2012లో విడాకులు తీసుకున్న తర్వాత తాను ఇంట్లో ఖాళీగా కూర్చోలేదని స్పష్టం చేశారు. సొంతంగా ఒక మరాఠీ సినిమాను నిర్మించానని, అది బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిందని గుర్తు చేశారు. ఆ తర్వాత మరో చిత్రానికి కథ అందించడంతో పాటు దర్శకత్వం, నిర్మాణ బాధ్యతలు కూడా స్వయంగా నిర్వహించానని తెలిపారు. అంతేకాకుండా పలు టీవీ డ్యాన్స్ షోలకు న్యాయనిర్ణేతగా పనిచేశానని, కవితలు రాశానని, ఇప్పుడు మళ్లీ వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నానని వివరించారు. నాకంటూ ఎలాంటి స్వతంత్ర గుర్తింపు, టాలెంట్ లేకపోతే నాకు ఇన్ని విభిన్న రంగాల్లో అవకాశాలు ఎందుకు వస్తాయని ఆమె ప్రశ్నించారు. సమాజంలో కొందరు వ్యక్తులు ఆయన లేకపోతే అసలు ఆమెకు బతికే అర్హతే లేదన్నట్లుగా దిగజారి మాట్లాడుతుంటారని, ఇతరుల వ్యక్తిగత జీవితాలను విమర్శించే ముందు కాస్త ఆలోచించాలని రేణు దేశాయ్ స్పష్టం చేశారు.



శార్వరి ఆశలన్నీ ఆ సినిమాపైనే!

'ముంజ్యా' తర్వాత మరో భారీ విజయం కోసం ఎదురుచూపులు

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్): బాలీవుడ్ యువ హీరోయిన్ శార్వరి వాగ్ ప్రస్తుతం తన కెరీర్‌లో తీవ్రమైన ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. 'బంటీ ఔర్ బబ్లీ 2' సినిమాతో కథానాయికగా వెండితెరకు పరిచయమైన ఈ భామ.. 'ముంజ్యా' చిత్రంతో అనూహ్య విజయాన్ని సాధించి విపరీతమైన గుర్తింపు తెచ్చుకుంది. ఆ సినిమాతో వచ్చిన క్రేజ్‌తో వరుసగా బాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థల నుంచి భారీ అవకాశాలు అందుకున్నప్పటికీ, ఆ విజయాన్ని ముందుకు కొనసాగించడంలో మాత్రం తడబడుతోంది. ముంజ్యా తర్వాత శార్వరి ఖాతాలో మరో భారీ హిట్ పడకపోవడం ఆమె కెరీర్‌ను రక్షణాత్మక ధోరణిలోకి నెట్టింది. శార్వరి నటించిన 'వేద' సినిమా బాక్సాఫీస్ వద్ద ఘోరంగా నిరాశపరిచింది. ఈ ఏడాది విడుదలైన 'మై వాపస్ ఆవూంగా' కూడా ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయిలో ఆదరణను అందుకోలేకపోయింది. ఇక ప్రతిష్టాత్మక యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ నిర్మించిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ఆల్ఫా' కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఈ సినిమాలో ప్రధాన పాత్రలో అలియా భట్ నటించగా.. శార్వరి తన నటన, సాహసోపేతమైన యాక్షన్ సన్నివేశాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అలియాకు పోటీ ఇచ్చేలా తన పాత్రలో రాణించినప్పటికీ.. సినిమా ఓవరాల్ ఫలితం ఆమెకు ఆశించిన తిరుగులేని గుర్తింపును తీసుకురాలేకపోయింది. వరుస పరాజయాలతో వెనకపడిపోయిన శార్వరి.. ఇప్పుడు రాబోయే 'యే ప్రేమ్ మోల్ లియా' సినిమాపైనే తన ఆశలన్నీ పెట్టుకుంది. బాలీవుడ్‌లో ఫీల్‌గుడ్ ప్రేమకథా చిత్రాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సూరజ్ బర్జాత్యా ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆయుష్మాన్ ఖురానాకు జోడీగా శార్వరి నటిస్తోంది. ప్రముఖ రాజశ్రీ ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. దాదాపు 11 ఏళ్ల తర్వాత దర్శకుడు సూరజ్ బర్జాత్యా, ప్రముఖ సంగీత దర్శకుడు హిమేష్ రేషమియా కలిసి పనిచేస్తుండటం ఈ చిత్రంపై బాలీవుడ్ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. నవంబర్ 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో పాటు వచ్చే ఏడాది విడుదల కానున్న 'బేపర్వా' కూడా శార్వరి కెరీర్‌కు అత్యంత కీలకంగా మారనుంది. 'యే ప్రేమ్ మోల్ లియా' చిత్రంతో శార్వరి మళ్లీ హిట్ల బాట పడుతుందా లేదా అనేది వేచి చూడాలి.

బాలయ్య 'దాదా'లో క్రేజీ ఐటెం సాంగ్..

థమన్ ఈసారి కూడా మాస్ బీట్‌తో దుమ్ములేపనున్నాడా?



హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్): నందమూరి నటసింహం బాలకృష్ణ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'దాదా' ఒకటి. గతంలో బాలయ్యతో 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందించిన మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. భారీ అంచనాల మధ్య శరవేగంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు చిత్ర బృందం ఎంతో కష్టపడుతోంది. మరోవైపు ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్న సంగీత సంచలనం ఎస్.ఎస్. థమన్ వర్క్ పట్ల అభిమానుల్లో విపరీతమైన అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాలో ఒక ఊపేసే ఐటెం సాంగ్ ఉండబోతోందనే ప్రచారం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. టాలీవుడ్‌లో బాలకృష్ణ, థమన్ కాంబినేషన్‌కు ప్రత్యేకమైన తిరుగులేని క్రేజ్ ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన గత చిత్రాల పాటలు, నేపథ్య సంగీతం (దీ+వీ) అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బాలయ్య మాస్ ఇమేజ్‌కు సరిగ్గా సరిపోయేలా థమన్ అందించే పవర్‌ఫుల్ బాణీలు థియేటర్లలో ప్రేక్షకులతో విజిల్స్ వేయిస్తుంటాయి. గతంలో వీరి కాంబినేషన్ తెచ్చిన మాస్ ఆల్బమ్స్ సూపర్ హిట్ కావడంతో 'దాదా' సినిమా సంగీతంపై కూడా అంచనాలు ఆకాశాన్ని తాకాయి. బాలకృష్ణ సినిమాల్లో ప్రత్యేక ఐటెం సాంగ్స్‌కు ఎప్పుడూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. మాస్ ప్రేక్షకులను థియేటర్లలో కుర్చీల్లో కూర్చోనీయకుండా ఊపేసేలా థమన్ అందించే బీట్స్ ఈ పాటలకు మరింత ఎనర్జీ ఇస్తుంటాయి. ఇప్పుడు 'దాదా' చిత్రంలో కూడా ఒక అదిరిపోయే ప్రత్యేక పాట ఉండబోతున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తుండగా, దీనికోసం థమన్ పక్కా మాస్ బీట్స్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ ప్రత్యేక పాటలో బాలయ్య సరసన స్టెప్పులు వేసే క్రేజీ బ్యూటీ ఎవరనే అంశం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. గతంలో బాలయ్య సినిమాల్లో కనిపించిన ఐటెం బాంబుల తరహాలోనే ఈసారి కూడా ఒక ప్రముఖ క్రేజీ కథానాయికను రంగంలోకి దించనున్నారా అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈ పాటలో డ్యాన్స్ చేయబోయే భామ ఎవరు, దీని చిత్రీకరణ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయాలపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రాన్ని బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, ఎమోషన్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్నారు. ఎలాంటి రూమర్లకు తావులేకుండా ఈ సినిమాను డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఆ నిర్ణయానికి గర్వపడుతున్నా

'స్త్రీ 2' బ్లాక్ బస్టర్ హిట్ అయిన తర్వాత చాలా పెద్ద సినిమా అవకాశాలు వచ్చినా.. నరైన కథ దొరికే వరకు ఎదురుచూడాలనుకున్నా" అని అంటున్నారు బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్. ఇటీవలే ఇన్‌స్టా వేదికగా అభిమానులతో ముచ్చటించిన శ్రద్ధకు.. కెరీర్‌లో ముందుకు వెళ్లాలనుకునే య-ువతకు మీరిచ్చే సలహా ఏంటి? అనే ప్రశ్న ఎదురైంది. దీనికి సమాధానంగా.. "నా అనుభవాన్నే చెబుతాను. 'స్త్రీ 2' తర్వాత నాకు చాలా సినిమా అవకాశాలు వచ్చాయి. భారీ పారితోషికం కూడా ఆఫర్ చేశారు. కానీ మనసుకు నచ్చిన కథ దొరికే వరకు ఓపికగా ఎదురుచూడాలని నిర్ణయించుకున్నా. ఆ నిర్ణయం తీసుకున్నందుకు ఇప్పుడు గర్వపడుతున్నా. మీ మనసు చెప్పేది వినండి. కొన్నిసార్లు అది కష్టంగా అనిపించినా.. చివరికి తగిన ఫలితం ఉంటుంద"ని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం శ్రద్ధా కపూర్ నటించిన 'ఈథా' డిసెంబరు 4న రానుంది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**